ఉష్ణోగ్రత శుక్రవారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 22.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు

శనివారం 4 అక్టోబరు 2025

నమామి దుర్గమ్మా..!

● ఘనంగా దసరా వేడుకలు ● ఆలయాలకు పోటెత్తిన భక్తులు

దసరా పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో వివిధ రూపాలలో భక్తులను అనుగ్రహించిన దుర్గామాతకు విజయదశమి రోజున ఇళ్లు, ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు.



విశేష పూజలు అందుకున్న ఖాద్రీశుడు



పుట్టపర్తి శిల్పారామంలో నృత్యం చేస్తున్న బాలికలు



లేపాక్షిలో రాజరాజేశ్వరి దేవి అలంకరణలో దుర్గాదేవి, ప్రత్యేక రథంలో ఊరేగుతున్న అమ్మవారు ↗





పుట్టపర్తిలో యజ్ఞాన్ని పూర్ణాహుతితో ముగిస్తున్న పండితులు

● లేపాక్షి వీరభద్ర స్వామి ఆలయలోఓ దుర్గా మాత గురువారం రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. పండుగను పురస్కరించుకుని భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో విచ్చేసి, అమ్మవారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం శమీ వృక్షం వద్ద పూజలు చేశారు.

● పుట్టపర్తి శిల్పారామంలో వందలాది మంది సమక్షంలో బెంగళూరు కళాకారులు భరత నాట్యంతో అలరించారు. ఇకపై ప్రతి ఆదివారం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామని ఏఓ ఖాదర్‌వలీ తెలిపారు. విశ్వ శాంతి కాంక్షిస్తూ ప్రశాంతి నిలయంలో చేపట్టిన వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞం గురువారం ఘనంగా ముగిసింది. చివరి రోజున వేదపండితులు పూర్ణాహుతి గావించారు. యజ్ఞజలాన్ని భక్తులపై చల్లారు. సాయి కుల్వంత్ సభా మండపంలో ఎంఎస్ స్ఫూర్తిరావు బృందం సంగీత కచేరీ నిర్వహించింది.



కచేరి నిర్వహిస్తున్న ఎంఎస్ స్ఫూర్తిరావు

● ఖాద్రీశుడి సన్నిధిలో దసరా వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను శమిపూజ మండపం వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. ఆయుధ పూజ, ఆస్థాన సేవ, కైంకర్యాలు పూర్తి అయిన తర్వాత స్వామి వారిని పుష్పాలతో అలంకరించారు. వేడుకలలో ఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ సిబ్బంది, పురప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.



నీలకంఠాపురంలో జంబూ సవారీలో పాల్గొన్న మాజీ మంత్రి రఘువీరా

ప్రతిష్ఠాత్మకంగా సత్యసాయి జయంత్యుత్సవాలు

ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి.. అధికారులకు కలెక్టర్ ఆదేశాలు




ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ, మాజీమంత్రి పల్లె, ట్రస్టు ప్రతినిధులు

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి) సత్యసాయి శతజయంతి వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిద్దామనీ, అందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. ఎస్పీ సతీష్‌కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డితో కలిసి కలెక్టర్ పట్టణంలో పర్యటించారు. ప్రశాంతి నిలయంలో ఏర్పాట్లను పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. సత్యసాయి ఎయిర్‌పోర్టును సందర్శించి వీవీఐపీల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. తదనంతరం ప్రశాంతి నిలయంలోని శ్రీనివాస్ గెస్టు హౌస్, ప్రైమరీ స్కూల్, హిల్‌వ్యూ స్టేడియం తదితర ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, డీఎస్పీ విజయ్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, సత్యసాయి ట్రస్టు ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు స్వచ్ఛ అవార్డులు

● 6న సీఎం చేతులమీదుగా పురస్కారాలు (7లో..)



సర్వం.. క్వాంటం..!

6

భవిష్యత్తంతా క్వాంటం టెక్నాలజీదే

ఎన్నో సమస్యలు, వ్యాధులకు పరిష్కారం

పట్టుసాధిస్తే అపారమైన ఉపాధి అవకాశాలు

జేఎన్‌టీయూఏ వైస్ చాన్స్‌లర్ సుదర్శన్‌రావు

301 చెరువులకు నీరివ్వాలి

● ప్రణాళిక రూపొందించండి
● కలెక్టర్ ఆనంద్ ఆదేశాలు

(వివరాలు 6లో...)

36 మంది వెళ్లారు.. 22 మంది వచ్చారు..

(7లో..)

శ్రీకాళహస్తి ఆలయ పాలక మండలి సభ్యుడిగా లక్ష్మీనారాయణ

కొత్తచెరువు, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా కొత్తచెరువు టీడీపీ నాయకుడు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు చిన్నపోల్ల లక్ష్మీనారాయణ నియమితుడయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం శ్రీకాళహస్తి దేవస్థానం ఆలయ పాలక మండలి సభ్యులను నియమించింది. లక్ష్మీనారాయణ నియామకం పట్ల మండల టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.



చిన్నపోల్ల లక్ష్మీనారాయణ

అరుదైన ఘనత

● స్వచ్ఛ కార్యాలయంగా పెనుకొండ ఫైర్ ఆఫీస్ ఎంపిక



స్టేషన్ ఫైర్‌ఆఫీసర్‌ను అభినందిస్తున్న రీజనల్ ఫైర్ ఆఫీసర్ భూపాల్‌రెడ్డి

పెనుకొండ టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన స్వచ్ఛ కార్యాలయాల జాబితాలో పెనుకొండ ఫైర్ స్టేషన్‌కు స్థానం దక్కినట్లు స్టేషన్ ఫైర్‌ఆఫీసర్ వెంకటేశులు తెలిపారు. స్థానిక కార్యాలయంలో రీజనల్ ఫైర్ ఆఫీసర్ కర్నూలు భూపాల్‌రెడ్డి సిబ్బందిని శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విధి నిర్వహణ ఎంత ముఖ్యమో తమ కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం అంతే ముఖ్యం అన్నారు. మన కార్యాలయం ఆహ్లాదంగా, పరిశుభ్రంగా ఉంటే విధి నిర్వహణలో మరింత బాధ్యతగా వ్యవహరించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పలువురు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

పండిట్లకు పండగ

● విజయ దశమి రోజే ఉద్యోగోన్నతులు
● స్కూల్ అసిస్టెంట్లుగా అవకాశం
● 114 మందికి రాత్రికి రాత్రే ఆర్డర్లు
● సర్వత్రా హర్షాతిరేకాలు



ఎల్‌పీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ఉత్తర్వులు అందజేస్తున్న విద్యాశాఖ అధికారులు

6

ఆటోడ్రైవర్ల సేవకు 5,720 మంది

పుట్టపర్తి టౌన్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆటోడ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా శనివారం జిల్లాలోని 5720 మంది ఆటో డ్రైవర్లకు ఆటోడ్రైవర్లసేవలో పథకం ద్వారా రూ.15 వేలు చొప్పున వారి ఖాతాల్లో జమ చేయనుంది. ఈ పథకం కోసం జిల్లాలో 6036 దరఖాస్తు చేసుకోగా వివిధ కారణాల వల్ల 316 తిరస్కరించారు. ధర్మవరం నియోజకవర్గంలో అత్యధికంగా 1343 మంది మడకశిర నియోజకవర్గంలో అత్యల్పంగా 220 మంది ఆటో డ్రైవర్లు పథకం ద్వారా లబ్ధి పొందనున్నారు.

ఒక్కటే అవస్థ

దశాబ్దాలుగా సింగిల్ రోడ్లే దిక్కు

● ఇబ్బంది పడుతున్న వాహనదారులు
● అమడగూరు మండలంలో దుర్భరంగా ప్రయాణం



సింగిల్ రోడ్డు నుంచి డబుల్ రోడ్డులోకి వస్తున్న బస్సు

అమడగూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సరిహద్దు మండలం అమడగూరులో సింగిల్ రోడ్లతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల కిందటి రోడ్లపైనే నేటికీ రాకపోకలు సాగుతున్నాయి. రోడ్లను విస్తరించాలన్న విషయాన్ని అధికారులు, పాలకులు విస్మరించారని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో కూరగాయలు ఎక్కువగా పండిస్తారు. పండిన పంటను కర్ణాటకలోని చేళూరు, బిల్లూరు, బాగేపల్లి, చింతామణి, కోలారు వంటి ప్రాంతాలకు వాహనాల్లో తరలిస్తారు. లోడ్‌తో వెళ్లే సమయంలో ఎదురుగా వాహనాలు వస్తే సింగిల్ రోడ్ల వల్ల బాగా ఇబ్బంది పడుతున్నట్లు వాహన డ్రైవర్లు వాపోతున్నారు. రోడ్డుకు ఇరువైపులా గుంతలు ఏర్పడ్డాయి. ముళ్ల చెట్లు భారీగా పెరిగి కొన్నిచోట్ల రోడ్డును కప్పేసేలా మారాయి. దీంతో మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనం కనపడక అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలం మీదుగా కర్ణాటకలోని సమీప పట్టణాలకే కాకుండా కదిరి నుంచి బెంగళూరుకు బస్సులు నడుస్తున్నాయి. అయితే మహమ్మదాబాద్ క్రాస్ నుంచి కొక్కంటి క్రాస్ వరకు మాత్రమే డబుల్ లేన్ రోడ్డు నిర్మించారు. మహమ్మదాబాద్ నుంచి బిల్లూరు, అమడగూరు, తుమ్మల వరకు సింగిల్ రోడ్డే. సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి రోడ్లను విస్తరించి, ప్రయాణాన్ని సులభతరం చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బండి నడపాలంటే నరకమే : బైరెడ్డి, డ్రైవర్, చేళూరు



మహమ్మదాబాద్ నుంచి బిల్లూరు వరకు వాహనం నడపాలంటే నరకప్రాయంగా ఉంటోంది. నిత్యం రైతులు పండించిన పంట దిగుబడులను మార్కెట్టుకు తరలిస్తుంటారు. అయితే ఇరుకు రోడ్లపై ఎదురుగా వచ్చే వాహనాలకు దారి ఇవ్వాలన్నా ఇబ్బందే. రాత్రి సమయాల్లో వాహనం నడపాలంటే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయం వెంటాడుతూ ఉంటుంది.

ఎన్ని ఇబ్బందులో: ఫయాజ్, డ్రైవరు, మహమ్మదాబాద్



నేను కారు అద్దెకు తిప్పుతూ జీవనం సాగిస్తున్నా. ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా బెంగళూరుకు వెళ్తుంటాం. రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రయాణం సాఫీగా సాగడం లేదు. వాహనాలు తరచూ రిపేరీకి వస్తున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి.

ప్రతిపాదనలు పంపాం

మండలంలోని మహమ్మదాబాద్ నుంచి చినగానిపల్లి వరకు డబుల్‌లేన్ రోడ్డుకు ప్రతిపాదనలు పంపాం. కొట్టువారిపల్లి, తుమ్మల మీదుగా ప్రతిపాదనలు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం.

-గిరి, ఆర్‌అండ్‌బీ డీఈ

సత్యసాయి ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు

గుండె, యూరాలజీ విభాగంలో ప్రారంభం

6



బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్‌లో ఇద్దరు గిరిజనుల హత్య

- మావోయిస్టుల ఘాతుకం..
- బీజాపూర్ జిల్లాలో లొంగిపోయిన 103మంది మావోయిస్టులు

చర్ల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్‌లోని బీజాపూర్, సుకుమా జిలాల్లో మావోయిస్టులు ఇద్దరు గిరిజనులను హత్య చేశారు. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ గ్రామానికి చెందిన మడకం భీమా(45)ను మావోయిస్టులు గురువారం అతని ఇంటి ఆవరణలోనే దారుణంగా కత్తులతో పొడిచి చంపేశారు. భీమా 2018లో తెలంగాణలోకి వెళ్లిపోయి, ములుగు జిల్లాలో ఓ ఎస్ఐతో కలిసి పని చేశాడని, గ్రామంలో పోలీస్ క్యాంప్ పెట్టిన తరువాత తిరిగి వచ్చి, ప్రజలను బెదిరిస్తూ, రూ.లక్షలు దోచుకుంటున్నాడని, భూములు ఆక్రమిస్తున్నాడని అందుకే హత్య చేశామని మావోయిస్టులు ఓ లేఖలో పేర్కొన్నారు. అలాగే సుకుమా జిల్లా కిష్టారం అడవుల్లో ఓ గిరిజనుడిని మావోయిస్టులు హతమార్చారు. ఇదిలా ఉంటే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గంగలూరు అడవుల్లో గురువారం సాయంత్రం ఎన్‌కౌంటర్ జరిగింది. ఒక మావోయిస్టు చనిపోయాడు. మరోవైపు, బీజాపూర్ జిల్లా పోలీసులు ఎదుట గురువారం 103 మంది మావోయిస్టు పార్టీ సభ్యులు లొంగిపోయారు. వీరిలో 22 మంది మహిళలున్నారు. లొంగి పోయిన వారిలో 47మందిపై మొత్తం కలిపి రూ.1.06కోట్ల రివార్డులున్నట్టు ఎస్పీ జితేంద్ర యాదవ్ తెలిపారు. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు 421మంది మావోయిస్టులు అరెస్టయ్యారని, 410 మంది లొంగి పోయారని, 137 మంది ఎన్‌కౌంటర్లలో మృతి చెందారని వెల్లడించారు.

అసభ్య పోస్టుల కేసులో అంజద్ బాషా పీఏ అరెస్టు

- కడప కోర్టులో హాజరు.. బెయిల్ మంజూరు

కడప క్రైం, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే ఆర్.మాధవిపై అసభ్య పదజాలంతో ఉన్న వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేసిన కేసులో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా పీఏ షేక్ మహ్మద్‌ఖాజాను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం అతన్ని కడప ఎక్సైజ్ కోర్టులో హాజరు పరచగా.. సొంత పూచీకత్తుపై అతనికి కోర్టు బెయిలు మంజూరు చేసింది. ఆ వివరాలను కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, వన్‌టౌన్ సీఐ రామకృష్ణ విలేకరులకు వివరించారు. కడప అక్బర్ వీధికి చెందిన షేక్ మహ్మద్ ఖాజా మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాకు పీఏగా పనిచేస్తున్నాడు. 2024 ఎన్నికల సమయంలో ప్రస్తుత కడప ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసరెడ్డిపై కడప అలంఖాన్‌పల్లెకు చెందిన విజయలక్ష్మి అసభ్యకరంగా మాట్లాడారు. ఆ వీడియోను అంజద్‌బాషా అతని సోదరుడు అహ్మద్‌బాషా ప్రోద్బలంతో సోషల్ మీడియాలో షేక్ మహ్మద్‌ఖాజా పోస్టు చేశాడు. ఈ వీడియో వైరల్ కావడంతో టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఫిర్యాదు మేరకు అంజద్‌బాషా, అహ్మద్‌బాషా, షేక్ మహ్మద్‌ఖాజాలపై కేసు నమోదు చేశారు. షేక్ మహ్మద్ ఖాజాను బుధవారం హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. గురువారం కోర్టులో హజరు పరిచారు. ఎవరైనా సోషల్ మీడియాలో అసభ్యకరమైన వీడియోలు పోస్టు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

'సిట్' ముందు హాజరైన మిథున్‌రెడ్డి

విజయవాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో నిందితుడిగా ఉన్న రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి విజయవాడలోని సిట్ అధికారుల ముందు శుక్రవారం హాజరయ్యారు. ప్రతి సోమవారం, శుక్రవారం సిట్ అధికారుల ముందు హాజరవ్వాలని కోర్టు బెయిల్ ఉత్తర్వుల్లో షరతు విధించింది. దాని ప్రకారం మిథున్‌రెడ్డి సిట్ కార్యాలయానికి వచ్చి పుస్తకాల్లో సంతకం చేశారు. ఇటీవలే ఆయనకు కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి విడుదలైన విషయం తెలిసిందే.

సత్యసాయి ఆస్పత్రిలో రోబోటిక్ సర్జరీ సేవలు



సర్జరీ సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యుడు చక్రవర్తి, పక్కన సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్ తదితరులు

- గుండె, యూరాలజీ విభాగంలో అందుబాటులోకి సేవలు

పుట్టపర్తి రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అత్యాధునిక రోబోటిక్ సర్జరీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రూ.8 కోట్ల విలువైన అత్యాధునిక రోబోటిక్ సర్జరీ వ్యవస్థను సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ, భగవాన్ సత్యసాయి ధ్యేయమైన విలువలు, కరుణ, ప్రేమతో కూడిన అత్యాధునిక వైద్యాన్ని ఉచితంగా అందుబాటులోకి తెచ్చామన్నారు. ఎస్ఎస్ ఇన్నోవేషన్స్ అనే భారతీయ సంస్థ ప్రపంచ స్థాయి ప్రమాణాలకు తగ్గట్లు ఈ రోబోటిక్ శస్త్ర చికిత్స వ్యవస్థను అభివృద్ధి చేసిందన్నారు. ఈ వ్యవస్థతో శరీరంలోని సున్నితమైన ప్రాంతాలకు కూడా అత్యంత కచ్చితత్వంతో, సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను సులభతరంగా చేయవచ్చని వెల్లడించారు. రోబోటిక్ సర్జరీకి రూ.లక్షలు ఖర్చు అవుతుందని, కానీ సత్యసాయి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో పూర్తి ఉచితంగా అందుతుందని స్పష్టం చేశారు.



రోబోటిక్ సర్జరీ యంత్రాలు

ములకలచెరువు కేంద్రంగా

నకిలీ మద్యం తయారీ

- రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యం స్వాధీనం
- స్పిరిట్, బాటిళ్లు, పరికరాలు సీజ్.. 9 మంది అరెస్టు



నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్న దృశ్యం.. స్వాధీనం చేసుకున్న నకిలీ మద్యం బాక్సులు

రాయచోటి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా ములకలచెరువులో శుక్రవారం ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపి రూ.1.75కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి అధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. అనంతరం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, ఆయన అనుచరుడు రాజు ములకలచెరువుకు సమీపంలోని కనుగొండ ఆర్చి సమీపంలో ఉన్న పాత డాబాను అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. ఈ మద్యాన్ని వాహనం ద్వారా తంబళ్లపల్లె నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పలు ప్రభుత్వ మద్యం షాపులకు కూడా ఈ మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్దతిప్ప సముద్రం మండలంలో తనిఖీలు నిర్వహిస్తూ.. నకిలీ మద్యం తీసుకెళ్తున్న వాహనాన్ని నిలిపారు. బాటిళ్ల మీద ఉన్న లేబుల్‌ను స్కాన్ చేశారు. అయితే స్కాన్ కాకపోవడంతో అనుమానం వచ్చి విషయాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై ఎక్సైజ్ డైరెక్టర్ రాహుల్ దేవ్‌కు ఫిర్యాదులు అందడంతో అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి శుక్రవారం ఈ దాడులు చేశారు. 15 వేల నకిలీ మద్యం బాటిళ్లు, 1050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1500 లీటర్ల బ్లెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, 4 వేల మద్యం సీసా మూతలు.. స్టిక్కర్లు, మద్యం బాటిళ్ల తయారు చేసే పరికరాలు, ఇతర సామగ్రి, నకిలీ మద్యం సరఫరా చేసే వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడు రాష్ట్రం కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, ఆనందన్, ఒడిశా రాష్ట్రం బ్రహ్మపూర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిధున్, విశాఖపట్నానికి చెందిన స య్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజు, నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు టీడీపీ నేత కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు, ములకలచెరువులోని రాక్‌స్టార్ ప్రభు త్వ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేశారు.

నిందితుల్లో తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి పీఏ



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

రాజేశ్ తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయ చంద్రారెడ్డి పీఏగా పనిచేస్తున్నారు. ఇతని పేరుతో ఉన్న వాహనం ద్వారానే నకిలీ మద్యం సరఫరా చేస్తున్నారు. దీనిపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీ వెనుక తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ముఖ్య నాయకుల సమీప బంధువుల ప్రమేయం ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. ఈ నకిలీ మద్యం తయారీలో జిల్లాలోని పలువురు టీడీపీ నాయకుల హస్తం ఉన్నట్టు కూడా ఆరోపణలు వినిస్తున్నాయి. నియోజకవర్గంలోని పలు బెల్ట్‌షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లోనూ ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు.

గ్యాంగ్ రేప్ కేసు నిందితులకు రిమాండ్

- గత నెల 25న చిత్తూరు సమీపంలో బాలికపై అఘాయిత్యం

చిత్తూరు అర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇటీవల చిత్తూరులో ఇంటర్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్‌కు పాల్పడిన ముగ్గురు యువకులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ సాయినాథ్ మీడియాకు వివరించారు. గత నెల 25వ తేదీన చిత్తూరు నగర సమీపంలో ఉన్న నీవా నగర వనం పార్కుకు వచ్చిన యువ జంటను ముగ్గురు యువకులు బెదిరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ జంటలోని యువకుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 29వ తేదీన పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో నిందితులైన మహేష్, కిశోర్, హేమంత్‌ను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. ముగ్గురు నిందితులకు పోక్సో కోర్టు ఈ నెల 16 వరకు రిమాండ్ విధించింది. నిందితుల్లో ఒకరైన మహేష్ ఓ బాలికను ఈవ్ టీజింగ్ చేసిన కేసులో నిందితుడిగా ఉన్నాడు. కిశోర్ 2022లో నగరంలోని ఓ వైన్ షాపులో పనిచేస్తుండగా అక్కడి మద్యాన్ని బ్లాక్‌లో విక్రయించాడని అతనిపై కేసు నమోదైంది. కాలక్షేపం కోసం పార్కులకు వచ్చే ప్రేమ జంటలను లక్ష్యంగా చేసుకుని వారు కలిసున్న దృశ్యాలను వీడియో తీసి వారిని బెదిరించడం.. వారి వద్ద ఉన్న నగదు, బంగారాన్ని లాక్కోవడం.. లైంగిక వేధింపులకు పాల్పడటం.. వీరి నేర ప్రవృత్తిగా పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. కాగా.. నిందితుల్ని స్థానిక డీపీవో కార్యాలయం నుంచి అర కిలో మీటరు దూరంలో ఉన్న కోర్టు వరకు బేడీలు వేసి రోడ్డుపై నడిపించుకుంటూ తీసుకెళ్లారు.

హోటల్ సిబ్బందిపై వైసీపీ నేత నాగార్జున యాదవ్ దాడి

- అల్పాహారం ఆలస్యంగా ఇచ్చారని దౌర్జన్యం
- ఇరువురికి గాయాలు.. కేసు నమోదు



హోటల్ యజమాని కొడుకు ప్రేమ్‌కుమార్

సత్తెనపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అల్పాహారం తీసుకురావడంలో ఆలస్యం అయిందని హోటల్ యజమాని, సిబ్బందిపై వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్ అతని అనుచరులు రెచ్చిపోయారు. వారిపై దాడి చేసి గాయపర్చారు. ఈ దాడి ఘటన గురువారం రాత్రి పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని తాలూకాసెంటర్‌లో జరిగింది. రాత్రి 10 గంటల సమయంలో నాగార్జున యాదవ్ అతని అనుచరులు పట్టణంలోని గుడ్‌మార్నింగ్ హోటల్‌కు టిఫిన్ చేసేందుకు వచ్చారు. టిఫిన్ అందించడం ఆలస్యమవుతుందని నాగార్జునయాదవ్ అతని అనుచరులు గొడవకు దిగారు. హోటల్ యజమాని శేఖర్, అతని కుమారుడు ప్రేమ్‌కుమార్, వర్కర్ నాగేశ్వరరావుపై దాడి చేశారు. ఈ ఘటనలో ప్రేమ్‌కుమార్, వర్కర్‌కు గాయాలయ్యాయి. తనతో పెట్టుకుంటే అబ్బూరు ఊరు ఊరంతా కదిలొస్తుందంటూ హోటల్ యజమాని శేఖర్‌ను నాగార్జున యాదవ్ బెదిరించారు. దాడి ఘటనపై హోటల్ యజమాని శేఖర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.



హోటల్ యజమానిపై దౌర్జన్యం చేస్తున్న వైసీపీ నాయకుడు యనమల నాగార్జునయాదవ్

పండిట్లకు పండగ

- విజయ దశమి రోజే ఉద్యోగోన్నతులు
- స్కూల్ అసిస్టెంట్లుగా అవకాశం
- 114 మందికి రాత్రికి రాత్రే ఆర్డర్లు
- సర్వత్రా హర్షాతిరేకాలు



ప్రమోషన్లు తీసుకోవడం కోసం గురువారం రాత్రి డీఈఓ ఆఫీస్‌వద్దకు చేరుకున్న లాంగ్వేజీ పండిట్లు

అనంతపురం విద్య, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): భాషా పండితుల(ఎల్‌పీ)కు దసరా పండుగ రోజే విద్యాశాఖ అమితానందాన్ని పంచింది. పిలిచి మరీ.. స్కూల్ అసిస్టెంట్లుగా ఉద్యోతోన్నతులు కల్పించింది. పండుగ రోజు సెలవు దినమైనా గురువారం అర్ధరాత్రి వరకు వారికి జిల్లా విద్యాశాఖాధికారులు ఉద్యోగోన్నతి ఉత్తర్వులు అందజేశారు. దీంతో ప్రమోషన్ పొందిన వారి ఆనందానికి అవధుల్లేవు. ఇది తమకు నిజమైన విజయ దశమి అంటూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.

పట్టించుకోని వైసీపీ పాలకులు

గత వైసీపీ హయాంలో ఎల్‌పీ అనే పదం ఉండకూడదని చెప్పి, ఎస్‌ఏలుగా అప్‌గ్రేడ్ చేసి హైస్కూళ్లకు పంపారు. ఉద్యోగోన్నతుల సమయంలో ఎస్జీటీలు సీనియారిటీ, మరోవైపు ఎల్‌పీల తెలుగు డిగ్రీ కోర్సుల విషయంలో వివాదం తలెత్తింది. అప్పటి పాలక పెద్దలు ఎస్జీటీలవైపే మొగ్గచూపడంతో లాంగ్వేజ్ పండిట్లకు ఉద్యోగోన్నతులు దక్కలేదు. ఎల్‌పీలుగానే రెగ్యులర్ ప్లేస్‌లేక డీఈఓ పూల్‌లో ఉండిపోవాల్సి వచ్చింది. ఎక్కడ అవసరం పడితే అక్కడికి పంపుతూ వచ్చారు. దీనిపై లాంగ్వేజ్ పండిట్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. స్కూల్‌అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ (ఉద్యోగోన్నతి) కల్పించాలని వైసీపీ పాలకులపై ఒత్తిడి తెచ్చారు. అయినా గత సర్కారు పట్టించుకున్న పాపాన పోలేదు. చివరకు హైకోర్టు తీర్పు ఇచ్చినా.. ఖాతరు చేయలేదు. ఎల్‌పీలు సుప్రీంకోర్టుకు వెళ్లగా.. అక్కడ సానుకూలమైన తీర్పు వచ్చింది. దీంతో ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి దృష్టికి కోర్టుతీర్పును తీసుకెళ్లారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కలిసి, న్యాయం చేయాలని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి.. ఎల్‌పీల డిమాండ్ న్యాయమైనదేననీ, వెంటనే వారికి ఉద్యోగోన్నతులు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. ఆ మేరకు రాష్ట్ర విద్యాశాఖ గురువారం విజయదశమి పండుగ సెలవు దినమైనా రాత్రికల్లా ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఎల్‌పీల ఉద్యోగోన్నతులకు లైన్ క్లియరైంది.

114 మందికి ప్రమోషన్

రాష్ట్ర శాఖ ఆదేశాలతో జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) ప్రసాద్‌బాబు, సూపరింటెండెంట్లు ఆదినారాయణ, జగదీష్, ఏఎస్ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్ వెంటనే ప్రక్రియ మొదలు పెట్టారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా తెలుగులో 90 మంది, హిందీలో 14 మంది, కన్నడలో ఒకరు, ఉర్దూలో 9 మంది ఇలా మొత్తం 114మంది ఎల్‌పీలు ఉన్నట్లు గుర్తించి, వారికి సమాచారం ఇచ్చారు. గురువారం రాత్రి 9 గంటల నుంచి అర్ధరాత్రిలోగా వారందరికీ స్కూల్ అసిస్టెంట్లుగా (అప్‌గ్రేడ్) చేస్తూ ఆర్డర్లు అందజేసారు. దీంతో లాంగ్వేజ్ పండిట్లు ఆనందం వ్యక్తం చేశారు.



ప్రభుత్వానికి కృతజ్ఞతలు: అనుపమ, హిందూపురం

6 నుంచి 10వ తరగతి వరకు తెలుగు బోధిస్తున్నా. ఉద్యోగోన్నతులు అడిగితే డిగ్రీ కోర్సు వివాదం రేపి, అన్యాయం చేశారు. న్యాయస్థానంలో అనుకూలంగా తీర్పు రావడం,కూటమి సర్కారు సానుకూలంగా స్పందించడంతో న్యాయం జరిగింది. తెలుగు టీచర్‌గా గుర్తించడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం.

పిలిచి మరీ.. ప్రమోషన్ ఇవ్వడం ఆనందదాయకం



లాంగ్వేజ్ పండిట్లమని మమ్మలను హేళనగా చూశారు. డీఈఓ పూల్‌లో పెట్టుకుని, ఎక్కడకు పడితే అక్కడకు బదిలీ చేసి పంపుతూ ఇబ్బందులు పెట్టారు. మా ఆరేళ్ల పోరాటం ఫలించింది. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకుని, అది కూడా విజయదశమిపండుగ రోజు పిలిచి మరీ.. ఉద్యోగోన్నతులు ఇవ్వడం ఆనందదాయకం. - **రమేష్‌కుమార్, రాయదుర్గం**



సర్వం.. క్వాంటం..!

భవిష్యత్తంతా క్వాంటం టెక్నాలజీదే



ఎన్నో సమస్యలు, వ్యాధులకు పరిష్కారం

పట్టుసాధిస్తే అపారమైన ఉపాధి అవకాశాలు

జేఎన్‌టీయూఏ వైస్ చాన్స్‌లర్ సుదర్శన్‌రావు



(ఆంధ్రజ్యోతి, అనంతపురం రూరల్)

మొన్న గూగుల్, నిన్న ఏఐ, నేడు క్వాంటం ఇలా సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతోంది. రోజుల సమయం పట్టే సమస్యలకు చిటికెలో పరిష్కారాలు చూపుతోంది. ఈ సంకేతికత విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలికింది. ప్రస్తుతం మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఎక్కడికెళ్లినా, ఏ సభలోనైనా సరే క్వాంటం టెక్నాలజీ గురించే మాట్లాడుతున్నారు. రాష్ట్ర రాజధానిలో క్వాంటం వ్యాలీ స్థాపించి, అభివృద్ధికి కృషి చేస్తానని చెబుతున్నారు. భవిష్యత్తంతా కూడా క్వాంటం టెక్నాలజీదే అని సాంకేతిక మేధావులు, పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ఈనేపథ్యంలో క్వాంటం వ్యాలీ అంటే ఏంటి..? దీని వలన కలిగే ఉపయోగాలు, ఉపాధి అవకాశాలు తదితర వాటి గురించి జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం అనంతపురం వైస్ చాన్సలర్ సుదర్శన్ రావు మాటల్లోనే తెలుసుకుందాం..

క్వాంటం కంప్యూటింగ్ అంటే..

క్వాంటం కంప్యూటింగ్ అనేది క్వాంటం ఫిజిక్స్ విచిత్ర నియమాలను ఉపయోగించి గణనలను నిర్వహించే ఒక సరికొత్త, శక్తివంతమైన సాంకేతికత. ప్రస్తుతం ఉన్న సాధారణ కంప్యూటర్లు ఉపయోగించే బిట్స్‌కు బదులుగా క్వాంటం కంప్యూటర్లు క్యూబిట్స్‌ను ఉపయోగిస్తాయి. ప్రస్తుతం ఉన్న సాధారణ కంప్యూటర్లు సమాచారాన్ని 0 లేదా 1బైనరీ బిట్స్ ఏదో ఒక్కదాన్ని మాత్రమే ప్రాసెస్ చేయగలుగుతున్నాయి. కాని క్వాంటమ్ కంప్యూటర్‌లోని క్యూబిట్స్ ఒకే సారి 0,1 లేదా రెండు కలసి పని చేస్తాయి. దీనినే సూపర్‌పొజిషన్ అంటారు. దీని కారణంగా క్వాంటమ్ కంప్యూటర్ ఒకేసారి అనేక గణన(లెక్కలు)లను చేయగలుగుతుంది. సాధారణ కంప్యూటర్ల కంటే ఎక్కువ రెట్లు వేగంతో పనిచేయడం జరుగుతుంది. క్యూబిట్ల సంఖ్య పెరిగే కొద్దీ కంప్యూటింగ్ శక్తి చాలా వేగంగా పెరుగుతుంది.

కంప్యూటింగ్ ఉపయోగాలు

క్వాంటమ్ కంప్యూటర్లు అత్యంత సంక్లిష్టమైన సమస్యలను సైతం ప్రస్తుతం ఉన్న సూపర్ కంప్యూటర్ల కంటే కూడా వేగంగా పరిష్కరించగలవు. ఇంజనీరింగ్ టెక్నాలజీ, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ అకౌంటింగ్, అన్ని రంగాల్లో క్వాంటం అప్లికేషన్లు ఉన్నాయి. ఫార్మసీలో కొత్త మందులు ఆవిష్కరణకు దోహదపడతాయి. ప్రస్తుతం కొత్త వ్యాక్సిన్ కనుగొనేందుకు ఏళ్ల సమయం పడుతోంది. అయితే క్వాంటం కంప్యూటింగ్ సాయంతో అతి తక్కువ కొత్త మందులు ఆవిష్కరించే అవకాశం ఉంటుంది. మెటీరియల్ సైన్స్, ఆర్థిక నమూనాలు, లాజిస్టిక్స్, రక్షణ పరిశోధనల్లో సైతం ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుంది. క్వాంటమ్ అల్గారిథమ్‌లను ఉపయోగించి బ్యాంకులు, ఇతరత్ర సంస్థల ఆర్థిక లావాదేవీల్లో జరిగే మోసాలను నివారించే వీలుంటుంది. వాతావరణంలో కలిగే మార్పులను చాల ముందుగా గుర్తించే వీలుంటుంది. దీనివలన వర్షాభావ పరిస్థితులు, తుపానుల హెచ్చరికలు ముందస్తుగా తెలుసుకోవడానికి వీలుంటుంది. అంతేకాకుండా సెన్సార్స్, సీటీస్కానింగ్, ఇమేజ్, వ్యాధి నిర్ధారణ సులభంగా చేసుకునే వీలుంటుంది. ప్రస్తుతం వాడుతున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను మరింత సమర్థవంతంగా వాడుకునే అవకాశాలను క్వాంటం టెక్నాలజీ అందిస్తుంది.

ఉద్యోగ అవకాశాలు..

క్వాంటం టెక్నాలజీ ద్వారా భవిష్యత్తులో చాలా ఉద్యోగ అవకాశాలు ఉండబోతున్నాయి. క్వాంటం సాఫ్ట్‌వేరు ఇంజనీర్లు, హార్డ్‌వేర్ ఇంజనీర్లు, క్వాంటం అల్గోరిథమ్ డెవలపర్లు, క్వాంటం మెషిన్ లర్నింగ్, క్వాంటం సిస్టమ్స్ ఆర్కిటెక్ట్‌లు, క్వాంటం అనలిస్టులు, కన్సల్టెంట్లు ఇలా పలు రకాలైన ఉద్యోగ అవకాశాలున్నాయి. వీటికి థియరీ కాకుండా ప్రాక్టికల్ నాలెడ్జ్ చాలా అవసరం. ఇంటర్న్‌షిప్స్, రిసెర్చ్ అవకాశాలు, ప్రాజెక్టుల్లో పనిచేయడం ద్వారా ఇది సాధ్యం అవుతుంది. ఇందులో కొత్త విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి.



కోర్సులు..అర్హతలు..

ప్లస్ టూ పూర్తిచేసి ఎంసెట్‌లో మెరిట్ సాధించిన వారు క్వాంటం టెక్నాలజీ కోర్సులు చదవడానికి అర్హులు. గ్రాడ్యుయేషన్ ఫిజిక్స్, కంప్యూటర్ సైన్స్, సంబంధిత విభాగాల్లో చదవాలి. ప్రోగ్రామింగ్ స్కిల్స్ అవర్చుకోవాలి. ఇప్పటికే ఆంధ్ర యూనివర్సిటీలో క్వాంటం కోర్సు ప్రారంభించారు. జేఎన్‌టీయూ పరిధిలోని కళాశాలల్లో కూడా క్వాంటం కంప్యూటింగ్ కోర్సులను ప్రారంభించాం. బీటెక్ విద్యార్థులకు మైనర్ డిగ్రీకి అవకాశం ఇచ్చాం.

301 చెరువులకు నీరివ్వాలి

- ప్రణాళిక రూపొందించండి
- కలెక్టర్ ఆనంద్ ఆదేశాలు



అనంతపురం కలెక్టరేట్, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 301 చెరువులకు నీరందించేందుకు ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆనంద్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో హెచ్చెల్సీ, హెచ్ఎన్ఎస్ఎస్, మైనర్ ఇరిగేషన్ అధికారులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లతో కలెక్టర్ శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... జిల్లాలో 301 చెరువులను నీటితో నింపేలా మాస్టర్ ప్లాన్ తయారు చేయాలన్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కాలువలు, ఆయకట్టు వివరాలను మ్యాప్ ద్వారా కలెక్టర్ ఆరాతీశారు.

అమృత్ పనులు వేగంగా చేపట్టాలి

నగరపాలక సంస్థ, మున్సిపాలిటీల్లో అమృత్ పథకం పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అమృత్ పథకం పనులు, టిడ్కో ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... అమృత్ 1.0 కింద రూ.15.35 కోట్లతో చేపట్టిన అనంతపురం వాటర్ సప్లై, ఇంప్రూవ్‌మెంట్ స్కీమ్ పనులు పూర్తికాగా.. రానున్న 30 రోజుల్లో ట్రయల్ రన్ పూర్తి చేయాలని పబ్లిక్ హెల్త్ ఈఈని ఆదేశించారు. అమృత్ 1.0 కింద రూ.10.98 కోట్లతో చేపట్టిన వాటర్ సప్లై, ఇంప్రూవ్‌మెంట్ స్కీం పనులు 98 శాతం పూర్తయ్యాయనీ, మిగిలిన వాటిని త్వరగా పూర్తి చేసి అక్టోబరు ఆఖరుకు ట్రయల్ రన్ పనులు మొదలు పెట్టాలన్నారు. 12,096 టిడ్కో ఇళ్లను గ్రౌండింగ్ చేశారనీ, అందులో 9,744 నిర్మాణం పూర్తయ్యాయన్నారు. వాటిలో సదుపాయాలు కల్పించి, లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

● బాలుడి మృతి.. మహిళకు గాయాలు


ఇంట్లోకి దూసుకుపోయిన కారు


నిఖిల్ (ఫైల్)

ముదిగుబ్బ, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొరిగల్లు గ్రామంలో గురువారం ఇంట్లోకి కారు దూసుకెళ్లడంతో అక్కడే ఆడుకుంటున్న నిఖిల్ (4) మృతిచెందగా, బాలుడి అత్త ఆదెమ్మ తీవ్రంగా గాయపడింది. ముదిగుబ్బ సీఐ శివరాముడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దొరిగల్లు గ్రామానికి చెందిన రాజశేఖర్, సృజన దంపతుల కుమారుడు నిఖిల్. రాజశేఖర్ సోదరి ఆదెమ్మకు అదే ఊరికి చెందిన వ్యక్తితో వివాహమైంది. పండుగకు ఆమె పుట్టింటికొచ్చింది. గురువారం ఇంటి వరండాలో ఆదెమ్మ, నిఖిల్ ఉన్నారు. అదే సమయంలో దొరిగల్లుకే చెందిన బాలాజీ తన కారుకు గుడి వద్ద పూజ చేయించుకుని వస్తూ.. అదుపుతప్పి రాజశేఖర్ ఇంట్లోకి దూసుకెళ్లాడు. నిఖిల్, ఆదెమ్మను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన వారిరువురిని.. కటుంబ సభ్యులు బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిఖిల్ మృతి చెందాడు. ఆదెమ్మను మెరుగైన వైద్యం కోసం అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

పాఠశాలకు వెళ్తుండగా బాలిక కిడ్నాప్

● కసాపురంలో వివాహం
● పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు

యాడికి, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్తున్న బాలికను కిడ్నాప్ చేసి, పెళ్లి చేసుకున్నాడు ఓ యువకుడు. యాడికిలో శుక్రవారం ఈ ఘటన కలకలం రేపింది. బాలిక తల్లిదండ్రులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక యాడికిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. దసరా సెలవుల అనంతరం శుక్రవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. బాలిక బస్సులో పాఠశాలకు బయలుదేరింది. పాఠశాల వద్ద దిగగానే కృష్ణారెడ్డి అనే వ్యక్తి కిడ్నాప్ చేసి, తీసుకెళ్లాడు. కసాపురం తీసుకెళ్లి వివాహం చేసుకున్నాడు. పెళ్లి ఫొటోలను సోషల్ మీడియాలో పెట్టాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు.. పోలీసులను ఆశ్రయించారు. బాలికను కిడ్నాప్‌చేసి వివాహం చేసుకున్న కృష్ణారెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం

అనంతపురం క్రైం, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): శింగనమలకు చెందిన పదో తరగతి విద్యార్థి దసరా పండుగ రోజు కనిపించకుండా పోయాడు. దీంతో బాలుడి తల్లిదండ్రులు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన మేరకు శింగనమలకు చెందిన ఓ మహిళా ఉద్యోగి అనంతపురంలోని ఖాజానగర్ ఉంటూ విధులు నిర్వర్తిస్తోంది. ఆమె భర్త , కుమారుడు శింగనమలలో ఉంటున్నారు. సెలవులు కావడంతో బాలుడు అనంతపురంలో ఉండే తల్లి వద్దకు వచ్చాడు. అయితే సెల్‌ఫోన్ ఎక్కువగా చూస్తుండటంతో తల్లి మందలించింది. దీంతో పండుగ రోజు గురువారం సాయంత్రం 7.30 గంటలకు గుడికి వెళ్తానని చెప్పి ఇంట్లోంచి బాలుడు బయటకు వెళ్లాడు. తర్వాత తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు అన్నిచోట్లా వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.

తప్పైంది స్వామీ..!

● చోరీ సామగ్రి ఆలయానికి చేరిక


ఆలయం వద్ద ఉంచిన బియ్యం ప్యాకెట్లు

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): చేసిన పని తప్పనుకున్నారో లేక భయపడ్డారో తెలియదు కాని చోరీ చేసిన సామగ్రిని తిరిగి తెచ్చి అయ్యప్ప దేవాలయం వద్ద పెట్టేశారు. ఈ సంఘటన మండలంలోని ఎం.కొత్తపల్లి బండపై వెలసిన అయ్యప్ప ఆలయం వద్ద గురువారం వెలుగుచూసింది. గత నెల 24న గుర్తు తెలియని వ్యక్తులు గర్భాలయంలో ఉన్న రెండు బియ్యం ప్యాకెట్లు, ఇతర సామగ్రిని అపహరించిన విషయం విదితమే. అయితే చోరీ చేసిన బియ్యం ప్యాకెట్లు, సామగ్రిని తిరిగి గురువారం ఆలయ ప్రాంగణంలో అయ్యప్పరథం వద్ద పెట్టి వెళ్లారని ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ఆలయం వద్దకు చేరుకుని పరిశీలించారు.

ఐఆర్‌సీఎస్ సమావేశం వాయిదా


పుట్టపర్తి టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ కమిటీ సభ్యుల ఎన్నికల కోసం శనివారం పుట్టపర్తిలో నిర్వహించాల్సిన సమావేశం వాయిదా వేసినట్లు డీసీఓ కృష్ణానాయక్ శుక్రవారం తెలిపారు. త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

వందే భారత్ రైలు రోజులో మార్పు

గుంతకల్లు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): అనంతపురం, ధర్మవరం మీదుగా వెళ్లే కాచిగూడ-యశ్వంతపూర్-కాచిగూడ (20703/04) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సర్వీసు రోజులను మార్పు చేసినట్లు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. ఈ రైలు ప్రస్తుతం శుక్రవారాలు మినహా మిగతా అన్ని రోజుల్లో నడుస్తోంది. డిసెంబరు 4 నుంచి వారంలో బుధవారం మినహా ఇతర రోజుల్లో ప్రయాణించేలా సర్వీసును మార్పు చేసినట్లు అధికారులు తెలిపారు.

ఆర్థిక ప్రణాళికను రూపొందించుకోండి

● రిటైర్డ్ ఉద్యోగులకు డీఆర్‌ఎం సూచన


రిటైర్డ్ ఉద్యోగికి సెటిల్మెంటు పత్రాన్ని అందజేస్తున్న డీఆర్‌ఎం

గుంతకల్లు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగులు సరైన ఆర్థిక ప్రణాళికను రూపొందించుకుని సెటిల్మెంటు ధనాన్ని సురక్షితమైన పెట్టుబడిగా మార్చుకోవాలని డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా పేర్కొన్నారు. స్థానిక డీఆర్‌ఎం కార్యాలయంలో రిటైరైన ఉద్యోగులకు రైల్వే పర్సనల్ డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో సెటిల్మెంటు శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీఆర్‌ఎం మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎంతో క్రమశిక్షణతో పనిచేసిన రైల్వే ఉద్యోగులు రిటైర్ అయిన తర్వాత అంతే నిబద్ధతతో విశ్రాంత జీవితాన్ని ప్లాన్ చేసుకోవాల న్నారు. అనంతరం విశ్రాంతోద్యోగులకు సెటిల్మెంటు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎస్బీఐ అధికారులు రైల్వే రిటైర్డు ఉద్యోగులకు పొదుపు నిర్వహణ, పెట్టుబడి ఎంపికలపై సూచనలిచ్చారు. పర్సనల్ శాఖాధికారులు, రైల్వే విశ్రాంతోద్యోగులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు స్వచ్ఛ అవార్డులు

● 6న సీఎం చేతులమీదుగా పురస్కారాలు


అవార్డుకు ఎంపికైన కియ పరిశ్రమ

న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛత అమలులో 2025 సంవత్సరానికి ఉమ్మడి జిల్లాకు అవార్డులు లభించాయి. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఈ అవార్డులు ప్రకటించింది. ఈనెల 6న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతులమీదుగా విజయవాడలో స్వచ్ఛాంధ్ర అవార్డులు అందుకోనున్నారు. మొత్తం 21కేటగిరిల్లో అవార్డులు ప్రకటిస్తూ శుక్రవారం జాబితా విడుదల చేశారు. ఉత్తమ గ్రీన్ అంబాసిడర్‌గా కదిరి మండలం బూరుగుపల్లి గ్రామపంచాయతీకి చెందిన దొడ్డెప్ప ఎంపికైనట్లు ఎంపీడీఓ పోలప్ప తెలిపారు. గ్రామ పంచాయతీ విభాగంలో అనంతపురం జిల్లా నార్పల మండలం బొందలవాడ పంచాయతీ ఎంపికైనట్లు పంచాయతీ కార్యదర్శి బీ శ్రీనివాసులు తెలిపారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని ఆదర్శంగా నిర్వహిస్తూ, ప్రతి రోజు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తూ గ్రామ పంచాయతీని పరిశుభ్రంగా ఉంచడంతో అవార్డు దక్కినట్లు ఆయన తెలిపారు. స్వచ్ఛ ఇండస్ట్రీస్ విభాగంలో కియ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎంపికయ్యాయి. పర్యావరణాన్ని మెరుగుపరచడం, వ్యర్థ నిర్వహణలో నూతన టెక్నాలజీని ఆవిష్కరించ డం, పరిశ్రమల పరిసరాల్లో స్థానిక సమాజంతో కలిసి పనిచేసి పర్యావ రణ అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిసింది.


గ్రీన్ అంబాసిడర్ దొడ్డప్ప


పంచాయతీ సెక్రెటరీ శ్రీనివాసులు


బొందలవాడలో ఏర్పాటు చేసిన చెత్తతో సంపద తయారీ కేంద్రం

36 మంది వెళ్లారు.. 22 మంది వచ్చారు

● జిల్లాకు చేరిన టీచర్ల అంతర్ జిల్లా బదిలీల జాబితా


ఇతర జిల్లాల నుంచి వచ్చిన టీచర్లకు ప్లేస్‌మెంట్స్ ఇస్తున్న డీఈఓ, ఏడీ

అనంతపురం విద్య, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): టీచర్ల అంతర్ జిల్లా బదిలీల జాబితాలు వచ్చేశాయి. ప్రభుత్వం నెలరోజుల క్రితం బదిలీలకు నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో స్పౌజ్, మ్యూచువల్ బదిలీల కింద జిల్లా నుంచి వివిధ కేడర్ల సబ్జెక్టులకు చెందిన 52 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు రావడానికి 42 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటిని రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో పరిశీలించిన అనంతరం నిబంధనలు, ఖాళీల ఆధారంగా జాబితాలకు ఆమోదం తెలిపారు. అందులో అనంత నుంచి ఇతర జిల్లాలకు 36 మందిని బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి అక్కడికి 22మంది టీచర్లను కేటాయిస్తూ జాబితాలను శుక్రవారం రాష్ట్రశాఖ పంపింది. జిల్లా నుంచి వెళ్లేవారిని జాబితా మేరకు డీఈఓ ప్రసాద్ బాబు రిలీవ్ చేశారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఇద్దరు చొప్పున గ్రేడ్-2 హెచ్‌ఎంలు, పీఎస్‌హెచ్‌ఎంలు, ముగ్గురు చొప్పున గణితం, ఫిజికల్ సైన్స్, ఒకరు చొప్పున సోషల్, ఇంగ్లిష్, బయాలజీ, పీఈటీ, స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్లు, 8 మంది ఎస్జీటీలు శుక్రవారమే డీఈఓ కార్యాలయంలో రిపోర్టు చేసుకున్నారు. వీరందరికీ రాత్రికిరాత్రే కౌన్సెలింగ్ నిర్వహించి, నిబంధనల మేరకు ఆయా యాజమాన్యాల పరిధిలోని ప్లేస్‌లను డీఈఓ ప్రసాద్‌బాబు, ఏడీలు మునీర్, శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ ఆదినారాయణ సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించి పాఠశాలలో ప్లేస్‌లు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. కొంతమంది రాలేకపోయిన వారికి శనివారం ఉత్తర్వులు ఇస్తామని డీఈఓ తెలిపారు.

తక్కువ పెట్రోల్ వేశారని గొడవ

● రూ.100కు రూ.50లదే వేశాలంటూ వాగ్వాదం
● విచారణ చేస్తున్న వన్‌టౌన్ పోలీసులు


బాటిల్‌లోకి వచ్చిన పెట్రోల్

అనంతపురం క్రైం, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): వంద రూపాయలకు పెట్రోల్ వేయమంటే రూ.50 పెట్రోల్ వేశారంటూ ఇద్దరు యువకులు, పెట్రోల్ బంకు సిబ్బంది, నిర్వాహకులతో వాగ్వాదం, గొడవకు దిగిన సంఘటన శుక్రవారం నగరంలో జరిగింది. బాధితులు, వన్‌టౌన్ పోలీసుల తెలిపిన మేరకు నగరానికి చెందిన ఇద్దరు యువకులు గుత్తి రోడ్డులో భారత్ పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి పెట్రోల్ వేయించుకున్నారు. రూ.100కు వేయమంటే బంకు సిబ్బంది తక్కువ పెట్రోల్ వేసినట్లు వారు అనుమానించారు. దీంతో బండి నుంచి పెట్రోల్ బయటకు తీశారు. బాటిల్‌లో సగం కూడా లేకపోవడంతో సిబ్బంది, బంకు నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. భారీగా జనాలు అక్కడ గుమిగూడటంతో వాగ్వాదం పెద్దగా మారింది. పలువురు స్థానికులు, వాహన చోదకులు సైతం పెట్రోల్ సరిగ్గా వేయడం లేదంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కొందరు ఆందోళనకారులు బంకులోని పూలకుండీలను ధ్వంసం చేశారు. బంకులో పెట్రోల్‌తోపాటు, చిన్న బండ్లకు ఆయిల్ కూడా సక్రమంగా వేయడం లేదంటూ ఆందోళన వ్యక్తం చేశారు. బంకును సీజ్ చేయాలంటూ డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అయితే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందలేదని, విచారణ తర్వాత కేసు నమోదు చేస్తామని సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. తూనికలు, కొలతలశాఖ అధికారులు శనివారం విచారణ చేయనున్నట్లు సమాచారం.


సిబ్బందితో గొడవ పడుతున్న యువకులు

మళ్లీ అదే..!

● తాడిపత్రిలోకి వెళ్లకుండా పెద్దారెడ్డిని అడ్డుకున్న పోలీసులు


పెద్దారెడ్డితో మాట్లాడుతున్న పోలీసులు

తాడిపత్రి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలోకి రాకుండా పోలీసులు మరోసారి అడ్డుకున్నారు. స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో ఓ వివాహానికి శుక్రవారం వెళ్తుండగా పట్టణ సీఐ ఆరోహణరావు సిబ్బందితో కలిసి అతన్ని అడ్డుకున్నారు. ఇల్లు విడిచి బయటకు తిరగరాదని సీఐ ఆరోహణరావు మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి సూచించారు. దీంతో ఆయన 'నేను ఏమైనా టెర్రరిస్టునా? ఇల్లు విడిచి వెళ్లకుండా ఉండటానికి' అని సీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అడ్డుకోమంటే అడ్డుకుంటున్నారా అంటూ మండిపడ్డారు. కనీసం మా బంధువులు, శ్రేయోభిలాషుల పెళ్లిళ్లు, పేరంటాలకు కూడా వెళ్లనీయకుండా ఉండటం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లోను పెళ్లికి వెళ్లాల్సిందేనని వాహనాన్ని ముందుకు కదిలించారు. పోలీసులు అడ్డుపడటంతో, వాహనం దిగి నడుచుకుంటూ కల్యాణ మండపం వైపు బయలుదేరారు. ఆ ప్రయత్నాన్ని కూడా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పెద్దారెడ్డి పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.రాజకీయాలు శాశ్వతం కాదని, ఎప్పుడూ ఒకేలాగ పరిస్థితులు ఉండవని హెచ్చరించారు. దాదాపు గంటపాటు వాగ్వాదం తర్వాత పెద్దారెడ్డి వెనుదిరిగి పోయారు.

డెమోగా నాగరాజు

అనంతపురం వైద్యం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ డెమోగా నాగరాజు నియమితుడయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీఎంహెచ్‌ఓ కార్యాలయంలోని పీఓడీటీటీ విభాగంలో నాగరాజు హెచ్ఈఈఓగా పనిచేస్తున్నారు. డిప్యూటీ డెమో త్యాగరాజు ఇప్పటివరకు ఇన్‌చార్జి డెమోగా కొనసాగుతూ వచ్చారు. నాగరాజు నియామకంతో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

పండుగపూట విషాదం

● ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు
● ఓ ఘటనలో తండ్రీకొడుకులు, మరో చోట వృద్ధుడి మృతి
● పలువురికి స్వల్ప గాయాలు


సుంకన్న, సుదర్శన్ (ఫైల్)


కత్తే బయన్న (ఫైల్)

ఉరవకొండ/ధర్మవరం రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా పండుగ పూట రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఉమ్మడి జిల్లాలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి చెందారు. ఉరవకొండ అంబేడ్కర్ నగర్‌కు చెందిన సుంకన్న(42), ఆయన కుమారుడు సుదర్శన్(9), కూతురు భవానితో కలిసి వజ్రకరూరు మండలం కడమలకుంట గ్రామంలోని సుంకులమ్మ ఆలయానికి గురువారం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. పీసీ ప్యాపిలి వద్ద ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరి బైక్‌ను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుంకన్న, సుదర్శన్ అక్కడికక్కడే మృతి చెందారు. స్వల్పంగా గాయపడిన భవానిని స్థానికులు ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సీఐ మహానంది ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ధర్మవరంరూరల్ మండలంలోని సీతారాంపల్లి క్రాస్ సమీపంలో గురువారం ఓ ఆటో బోల్తాపడి చంద్రాచెర్లకు చెందిన కత్తే బయన్న (77) మృతి చెందాడు. రాప్తాడు మండలం గొల్లపల్లిలో ఉన్న గొల్లపల్లయ్యస్వామి దర్శనానికి వెళ్లాడు. దర్శనం చేసుకుని తిరిగి సాయంత్రం ఆటోలో ఇంటికి బయల్దేరాడు. సీతారాంపల్లి క్రాస్ సమీపంలో ద్విచక్రవాహనాన్ని తప్పించే క్రమంలో ఆటో బోల్తా పడింది. ఈప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు రాయపాటి సతీష్, ఆటోలో ప్రయాణిస్తున్న నాగరత్నమ్మ కూడా గాయపడ్డారు. క్షతగాత్రులను ధర్మవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. బయన్న మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య వన్నక్కతో పాటు నలుగురు కుమారులు ఉన్నారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ

● మంత్రి సవిత చేతులమీదుగా వాయనాలు పంపిణీ


అలంకరణలో మహేశ్వరి అమ్మవారు

పెనుకొండ రూరల్, అక్టోబరు 3: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని చంద్రగిరి గ్రామంలో శ్రీగిరి మహేశ్వరి శక్తి పీఠంలో మహేశ్వరి అమ్మవారి విగ్రహప్రతిష్ఠ గురువారం ఘనంగా నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు. మహారుద్రాభిషేకం, మహాపుష్పాలంకరణ, మహా చండీయాగం, పూర్ణాహుతి, ముత్తైదువులకు వాయినాలు సమర్పణ, చండీయాగం, గ్రామోత్సవం, కోనేటి తెప్పోత్సవం నిర్వహించినట్లు పీఠాధిపతి దేవేంద్రస్వామి తెలిపారు. బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో 500మందికిపైగా మహిళలకు చీర, సారె పంపిణీ చేశారు. మంత్రి వెంట సింగిల్‌విండో అధ్యక్షుడు పోతిరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, సూర్యనారాయణ, కేశవయ్య, వాసుదేవరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మహిళలకు వాయనాలు ఇస్తున్న మంత్రి సవిత

హంద్రీనీవా పెండింగ్ పనులకు ఆమోదం

అనంతపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న హంద్రీనీవా పనులు చేపట్టేందుకు రాష్ట్ర మంత్రి మండలి శుక్రవారం ఆమోదం తెలిపింది. ఉరవకొండ నియోజకవర్గంలోని హంద్రీనీవా ప్రాజెక్టు ఫేజ్-1లో భాగంగా రాకెట్ల గ్రామ సమీపంలో ఆమిద్యాల లిఫ్ట్ పథకం ప్రారంభం, ఫేజ్ -2లో భాగంగా ప్యాకేజీ 52 - ఏలో పెండింగ్‌లో ఉన్న రూ.72.30 కోట్ల విలువైన 2 పనులకు ఆమోదం తెలిపింది. ఈ పనులను గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన విషయం తెలిసిందే. జిల్లాలోని ఉరవకొండ, వజ్రకరూరు, విడపనకల్లు మండలాల్లోని 10500 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకుగాను వజ్రకరూరు మండలం రాగులపాడు సమీపంలోని కొట్టాలపల్లి లిఫ్ట్ పథకం నుంచి హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా వంద క్యూసెక్కుల నీటిని ఎత్తిపోసేందుకు రూ.55.60 కోట్లతో పనులు చేపట్టేందుకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ పనుల ద్వారా 10500 ఎకరాలకు సాగునీటితోపాటు ఆ ప్రాంత వాసులకు తాగునీరు అందనుంది. అనంతపురం మిడ్ పెన్నార్ ప్రాజెక్టుకు రబ్బర్ సీల్స్ మార్చడం, కొత్త వాక్‌వే వంతెన నిర్మాణం, రేడియల్ క్రస్ట్ గేట్లకు ఇసుక బ్లాస్టింగ్, పెయింటింగ్, కంట్రోల్ ప్యానెల్ కొత్త బోర్డుల సరఫరా, సబ్ డిస్ట్రిబ్యూషన్ ప్యానెల్ బోర్డులు, కంట్రోల్ ప్యానెల్ బోర్డులు, ఆనకట్ల సుందరీకరణ పనులకు రూ.5.2 కోట్లకు ఆమోదం లభించింది.

గాంధీజీ ఆశయాలను కొనసాగిద్దాం: జడ్పీ చైర్‌పర్సన్


గాంధీజీ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): గాంధీజీ ఆశయాలను కొనసాగిద్దామని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ పేర్కొన్నారు. గురువారం మహాత్ముడి జయంతి వేడుకలను జడ్పీలో ఘనంగా నిర్వహించారు. జడ్పీ చైర్‌పర్సన్.. గాంధీజీ విగ్రహానికి పులమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆమె మా ట్లాడుతూ.. మహాత్ముడి ఆశయాలను సాధించే దిశగా ఉద్యోగులు క్రియాశీలకంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. గాంధీజీ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

అనంత కార్టూన్‌కు అంతర్జాతీయ బహుమతి


చిన్న కుళ్లాయుప్ప


చిన్న కుళ్లాయప్ప గీసిన కార్టూన్

నార్పల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లావాసి గీసిన కార్టూన్‌కు అంతర్జాతీయ స్థాయి లో అవార్డు దక్కింది. అబ్లా ఆర్ట్ ఫౌండేషన్ నిర్వహించిన అలీ అల్మమేక్ కారికేచర్ కాంపిటీషన్‌లో వివిధ దేశాల నుంచి పోటీపడ్డారు. నార్పలకు చెందిన ఆర్ట్ టీచర్ చిన్న కుళ్లాయప్ప గీసిన కార్టూన్ ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. ఈ విషయాన్ని నిర్వాహకులు గురువారం ప్రకటించారు. దీంతో కుళ్లాయప్ప హర్షం వ్యక్తం చేశారు. ఆయన కేశపల్లి ఉన్నత పాఠశాలలో ఆర్ట్ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇదే పోటీలో పోర్చుగల్ వాసి ప్రథమ బహుమతి గెలుచుకోగా, ఇండోనేషియా కార్టూనిస్టు మూడో స్థానంలో నిలిచారు.

న్యూస్ బాక్స్

రౌడీషీటర్లలో మార్పురావాలి: డీఎస్పీ



గ్రామస్థులతో మాట్లాడుతున్న డీఎస్పీ హేమంత్‌కుమార్

తాడిమర్రి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): నేరప్రవృత్తికి స్వస్తిపలికి సత్ప్రవర్తనతో నడుచుకోవాలని రౌడీషీటర్లకు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ హెచ్చరించారు. గురువారం రాత్రి తాడిమర్రిలో సైబర్ క్రైమ్, భూతగాదాలు, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రౌడీషీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. ఎక్కడైనా గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాలలో ఎక్కడ, ఏ సమస్యలు ఉన్నా, అపరిచిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని డీఎస్పీ తెలియజేశారు. కార్యక్రమంలో సీఐ శ్యామరావు, ఎస్ఐ కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడిన వారికే గుర్తింపు



చిలకం మధుసూదన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ధర్మవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పార్టీలో కష్టపడిన వారికే గుర్తింపు ఉంటుందని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. ఏపీ బెస్త సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన బెస్త శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం మధుసూదన్‌రెడ్డిని గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పార్టీలో కష్టపడిన వారికే గుర్తింపు ఉంటుందని తెలిపారు. బెస్తసంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన శ్రీనివాసులు మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏని రెన్యువల్ చేయాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఆర్డీటీ పరిరక్షణ సమితి సభ్యులు

ధర్మవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి వెంటనే ఎఫ్‌సీఆర్ఏని రెన్యువల్ చేయాలని ఆర్డీటీ పరిరక్షణ సమితి నాయకుడు డాక్టర్ ఆదిశేషు డిమాండ్ చేశారు. గురువారం గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సమితి సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆదిశేషు మాట్లాడుతూ.. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఆర్డీటీ సేవలు నిలిచిపోవడం వల్ల పేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకుని ఆర్డీటీకి అనుమతి మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు వినయ్, నరేంద్ర, శ్రీనివాసులు, సోము, హరికృష్ణారెడ్డి, బాషా, రాజశేఖర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీ



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

నల్లమాడ, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపల్లి సమీపాన రైతు మనోహర్ మామిడితోటలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్ దొంగలించినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి 9 గంటల వరకు మామిడి తోటలో ఉన్నామని, అనంతరం రెడ్డిపల్లి వెళ్లిపోయామని తెలిపారు. రాత్రి పొద్దుపోయాక గుర్తు తెలియని వ్యక్తులు మామిడి తోటలోకి వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్ పగలకొట్టి అందులోని కాపర్‌వైర్లు దొంగలించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆసుపత్రి సమస్యలను పరిష్కరించండి

కదిరిఅర్బన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలని సీపీఎం నాయకులు శుక్రవారం ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆసుపత్రికి కదిరి పది మండలాల నుంచి అనేక మంది రోగులు వస్తుంటారన్నారు. ఓపీ చీటి రాయడానికి ఓటీపీని నెంబర్లు అడుగుతున్నారని, ఆసుపత్రికి వచ్చేవారికి చాలా మందికి ఫోన్‌లు ఉండవని, దీంతో గంటల తరబడి నిల్చోవాల్సి వస్తోందన్నారు. ప్రతి రోజు 600 మంది దాకా రోగులు వస్తుంటే మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సిబ్బంది కొరత కూడా ఎక్కువగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు జగన్‌మోహన్, బాబ్జాన్, రామ్మోహన్. సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు, గంగప్ప తదితరులు ఉన్నారు.



ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు



ధర్మవరంలో వెండిరథంపై ఊరేగుతున్న పెద్దమ్మతల్లి



గాంధీనగర్‌లోని చౌడేశ్వరి ఆలయంలో ఉయ్యాలోత్సవం



విజయదుర్గాదేవి అలంకరణలో దుర్గమ్మ

వైభవంగా దసరా ఉత్సవాలు

(న్యూస్ నెట్‌వర్క్- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పలు ప్రాంతాల్లో గురు, శుక్రవారాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు పంచామృతాభిషేకం, అర్చనలు, అభిషేకాలు, హోమాలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. ధర్మవరం పట్టణం సాలె వీధిలోని పెద్దమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని వెండిరథంపై ఊరేగించారు. గాంధీనగర్ చౌడేశ్వరి ఆలయంలో ఉయ్యాలోత్సవం నిర్వహించారు. నల్లమాడలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మైలే రామచంద్ర నివాసం వద్ద సొంత నిధులతో నిలిపి దుర్గమ్మ ప్రతిమకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పూజలు చేశారు. కొత్తచెరువు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టపర్తి మండలం మామిళ్లకుంట కూడలి, ఎనుములపల్లి, ప్రశాంతినిలయంలో తదితర ప్రాంతాల్లో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. తాడిమర్రి కనులపండువగా వసంతోత్సవాన్ని నిర్వహించారు. ముదిగుబ్బలో పెద్దమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నల్లమాడలో దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి



మామిళ్లకుంటలో రాజరాజేశ్వరిగా లలితాపరమేశ్వరి



పుట్టపర్తిలో ప్రత్యేక అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి



ముదిగుబ్బలో పెద్దమ్మతల్లికి ఆయుధపూజ



తాడిమర్రిలో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

నిలువెత్తు నిర్లక్ష్యం..!

● ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న తీగ ● పట్టించుకోని విద్యుత్‌శాఖ

కొత్తచెరువు, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ నిర్లక్ష్యానికి ఇది నిదర్శనంగా నిలుస్తోంది. మండల కేంద్రంలోని వేణుగోపాల్, నెహ్రూనగర్ కాలనీలతో పాటు పలుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు, స్తంభాలకు తీగలు అల్లుకున్నాయి. దీంతో తరచూ విద్యుత్ ప్రసారానికి అంతరాయం కలుగుతోందని ఆయా కాలనీవాసులు వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు విద్యుత్ స్తంభానికి, ట్రాన్స్‌పార్మర్ కు తీగలు అల్లుకొని ఉండడంతో విద్యుత్ సరఫరా అవుతోంది. దీంతో షాక్ కొడుతోందని పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. ప్రమాదం జరిగి ప్రాణాలు పోతే కానీ పట్టించుకోరా అంటూ కాలనీవాసులు మండిపడుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లకు, స్తంభాలకు తీగలను తొలగించకుండా అలాగే వదిలేశారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఆ తీగలను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా కాలనీల ప్రజలు కోరుతున్నారు.



వేణుగోపాల్ నగర్‌లో ట్రాన్స్‌పార్మర్‌కు అల్లుకున్న తీగ

ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి

ధర్మవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మా గాంధీ, దేశ రెండో ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని బీజేపీ నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు, పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు నాగభూషణ, నబీరసూల్, మహేశ్ పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు : మండల వ్యాప్తంగా జాతిపిత గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎంపీపీ తుమ్మల పర్వీన్, కార్యాలయ పర్యవేక్షకుడు రమణానాయక్, పూలమాలవేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి నివాళులర్పించారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయుడి మృతి

కొత్తచెరువు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు మంచాల సుబ్బన్న(93) శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈయన చదువుకున్న బాలుర ఉన్నత పాఠశాలకు హెచ్ఎంగా పనిచేశారు. ఆ సమయంలో విద్యార్థులకు క్రమశిక్షనతో కూడిన విద్యను అందించారు. ఆయనకు భార్య కొడుకు, కూతురు ఉన్నారు. సుబ్బన్న మృతికి పలువురు ఆయన శిష్యులు తదితరులు నివాళి అర్పించారు.



సుబ్బన్న(ఫైల్)

ఘనంగా అమ్మవారి నిమజ్జనం



బత్తలపల్లిలో నిమజ్జనానికి వెళుతున్న అమ్మవారు

బత్తలపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బత్తలపల్లిలో దేవీనవరాత్రి ఉత్సవాలలో భాగంగా 11 రోజుల పాటు విశేష పూజలు అందుకున్న అమ్మవారిని శుక్రవారం ఘనంగా నిమజ్జం చేశారు. ధర్మవరం రోడ్డులో ప్రత్యేక మండపాన్ని ఏర్పాటు చేసి 11 రోజులు పాటు విశేష పూజలు నిర్వహించారు. శుక్రవారం ప్రత్యేక వాహనంలో అమ్మవారిని ఊరేగించారు. ఈ ఉరేగింపులో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నయి. ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ అధ్యక్షురాలు దేవరకొండ కౌసల్య ఆధ్వర్యంలో మహిళలు కోలాట నృత్య ప్రదర్శన చేశారు. ఉరుముల కళాకారుల ప్రదర్శన కూడా ఆకట్టుకుంది. అమ్మవారిని రామాపురం సమీపంలోని చిత్రావతి నదిలో నిమజ్జం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జక్కంపూటి సత్యనారాయణ, పురుషోత్తంచౌదరి, రంగానాయుడు, భాస్కర్, వినయ్, చిట్టి ఓబులనాయుడు, అజయ్, మనోజ్, తదితరులు పాల్గొన్నారు.

● ఓబుళదేవరచెరువు : మండల క్రేందంలోని బీఆర్ అంబేడ్కర్ కాలనీలో కొలువు దీరిన కనకదుర్గ అమ్మవారి విగ్రహానికి పూ జలు చేపట్టిన అనంతరం భక్తి శ్రద్దలతో నిమజ్జనం నిర్వహించారు. కళాకారులు, భజనలు, సాంస్కృతిక కార్ర్యకమాలు నిర్విహించి అన్నదానం చేశారు. ఊరేగింపు నిర్వహించి నిమజ్జనం చేశారు.



నిమజ్జనానికి తరలుతున్న దుర్గమ్మ

మహిళకు కుట్టుమిషన్ పంపిణీ

కొత్తచెరువు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని విజయనగర్ కాలనీకి చెందిన తాజున్నిసాకు గురువారం కుట్టుమిషన్ ఇచ్చామని ఖిద్మత్ ఎ ఖల్క్ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు షామీర్ తెలిపారు. ఆమె ఇద్దరు బాలికలను చదివించుకుంటోందని, భర్త లేక పోవడంతో కుటుంబ పోషణకు ఇబ్బందులు పడుతోందన్నారు. రూ. 10 వేల విలువ చేసే కుట్టుమిషన్‌ను అందించామన్నారు.

జీఎస్టీపై అవగాహన పెంచుకోవాలి

● పలుచోట్ల ర్యాలీలు
● అవగాహనా కార్యక్రమాలు

ధర్మవరం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ వివరాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ సాయికృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం 25వ వార్డులో కమిషనర్, వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ బీమనేని ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ...అన్ని వస్తువులపై ప్రభుత్వం జీఎస్టీని తగ్గించిందని, కొనుగోలు చేసినప్పుడు ప్రస్తుతం తగ్గించిన జీఎస్టీ శాతం ప్రకారమే చెల్లించాలని తెలిపారు కార్యక్రమంలో మున్సిపాలిటీ టీపీఓ విజయభాస్కర్ పాల్గొన్నారు.



ధర్మవరరంలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ అధికారులు, గాండ్లపెంటలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

● తాడిమర్రి : ప్రభుత్వం వ్యవసాయ పరికరాలపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించిందని, ఈ అవకాశాన్ని రైతులు ఉపయోగించుకోవాలని తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ రంగారావులు పేర్కొన్నారు. తాడిమర్రి ఆర్‌బీకేలో శుక్రవారం జీఎస్టీపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ శేఖర్‌నాయక్, ఎంఏఓ శివశంకర్, ఏపీఓ అనిల్, టీడీపీ నాయకులు హర్ష, పాపానాయుడు పాల్గొన్నారు.

● గాండ్లపెంట : జీఎస్టీ తగ్గింపుతో రైతులకు వ్యవసాయ పరికరాలు తక్కువ ధరలకు లభిస్తాయని ఎంపీపీ సోమశేఖర్‌రెడ్డి తెలిపారు. గాండ్లపెంట మండల కేంద్రంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాబూరావు, వ్యవసాయాధికారి షాదాబ్, వివిధ శాఖల అధికారులు, ఉపసర్పంచ్ లక్ష్మీనర్సారెడ్డి, నాయకులు సిద్దారెడ్డి, అక్రమబాష, బాబా, యూనస్, ఫక్రుద్దీన్, వెంకటరెడ్డి, ఫకృద్దీన్, చంద్రసింగ్ పాల్గొన్నారు.

● నల్లమాడ : మండల కేంద్రంలో జీఎస్టీ తగ్గింపుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపరనింటెండెంట్ గజ్జల శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి దాదాసాహెబ్, టీడీపీ నాయకులు మైలే శివశంకర్, రమణారెడ్డి, బట్టి నాగభూషణంనాయుడు, కొట్ల మంజునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న సమగ్ర శిక్ష జేఏసీ నాయకులు

కొత్తచెరువు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని జేఏసీ జిల్లా అధ్యక్షుడు ఓబిరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ ఎదుట శుక్రవారం సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులతో కలసి తమ డిమాండ్స్ కూడిన సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఓబిరెడ్డి మాట్లాడుతూ.. సమగ్ర శిక్షలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌లో 18 విభాగాల్లో పనిచేస్తున్నామన్నారు. తమ న్యాయమైన డిమాండ్స్ అయిన సమగ్రశిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలోకి విలీనం చేయాలన్నారు. ఈ నెల 12న విజయవాడలో సభ నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వరప్రసాద్, భాస్కర్, ముకుంద రెడ్డి, శ్రీలత, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఆటో ర్యాలీని విజయవంతం చేయండి

పుట్టపర్తిరూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఎన్నికల హామీల్లో భాగంగా అమలవుతున్న వాహనమిత్ర పథకానికి అభినందనలు తెలియచేస్తూ నిర్వహించనున్న ఆటోర్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు పుట్టపర్తిలోని సత్యమ్మదేవాలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని.. కర్ణాటకనాగేపల్లి బ్రిడ్జి, చిత్రావతి రోడ్, గణేష్‌కూడలి వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమానికి కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

● ధర్మవరం : వాహన మిత్ర పథకం ప్రారంభ కార్యక్రమానికి శనివారం ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ హాజరవుతున్నారని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, జిల్లా అధికార ప్రతినిధి పురుషోత్తంగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డ్‌లోని ఆర్టీఓ కార్యాలయ ఆవరణంలో కార్యక్రమం ఉంటుందన్నారు.

వన్యప్రాణి సంరక్షణపై అవగాహన



సంగటివారిపల్లిలో అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

కదిరి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణి వారోత్సవాలలో భాగంగా శుక్రవారం తలుపుల మండల పరిధిలోని వేపమానిపేట, సంగటివారిపల్లి గ్రామాలలో వన్యప్రాణి సంరక్షణపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని ఫారెస్ట్ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఓ రామచంద్రారెడ్డి, ఈఓలు నరసింహామూర్తి, శ్రీనివాసులు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి పింఛన్ అందజేత

నల్లచెరువు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నల్లచెరువుకు చెందిన దివ్యాంగురాలు ఆస్మా మదనపల్లి వద్ద ఉన్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో చదువుతోంది. ఆమెకు ప్రతి నెలా వచ్చే పింఛన్‌ను తన సమీప బంధువు తీసుకుని హింసించేవాడు. బాలికవిషయం తెలుసుకున్న పాఠశాల చైర్‌పర్సన్ భాగ్యలక్ష్మి బంధువుల తీరుపై కోర్టును ఆశ్రయించారు. దీనికి స్పందించిన కోర్టు బాలిక బ్యాంక్ ఖాతాకి జమ అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. గడిచిన మూడు నెలల పింఛన్ సొమ్మును కూడా ఎంపీడీఓ రామకృష్ణ శుక్రవారం బాలిక చేతికి అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది బాలజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పాతమిద్దె దగ్ధం

అమడగూరు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జౌకల కొత్తపల్లిలో కుమ్మరి రెడ్డెప్పకు చెందిన పాత మిద్దెలో శుక్రవారం మంటలు చెలరేగి దగ్ధమయింది. పాతమిద్దెలో పశువుల కోసం ఉలవపొట్టు నిల్వ ఉంచారు. ప్రమాదవశాత్తు అగ్గి రాసుకుని పొట్టు పూర్తిగా కాలిపోయింది. ఇల్లు పైకప్పు కట్లతో కప్పడం వలన పూర్తిగా కాలి బూడిదయింది. గ్రామస్తులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక యంత్రానికి ఫోన్ చేసి చేశారు. దీంతో సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ ఎస్ఐ మహబూబ్ సుబహాన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాల్యమిత్రుడి కుటుంబానికి చేయూత

బుక్కపట్నం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన బుక్కపట్నంకు చెందిన షంషీర్ ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి ప్రమాదవశాత్తు అక్కడే మరణించాడు. షంషీర్ కూతురి వివాహం కోసం 1990 బ్యాచ్ పదో తరగతికి చెందిన అతడి మిత్రులు రూ.70 వేల నగదును కుటుంబ సభ్యులకు శుక్రవారం అందించారు. కార్ర్యకమంలో బాల్య మిత్రులు శ్రావణ్‌కుమార్, చంద్ర, నారాయణస్వామి, రాజ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

ఓబుళదేవరచెరువు, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం స్థానిక గ్రామ సచివాలయంలో పారిశుధ్య కార్మికులను సన్మానించారు. తొలుత మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం సర్పంచ్ గోవిందు, గ్రామకార్యదర్శి శంకరప్ప పారిశుధ్య కార్మికులకు సన్మానించి, నూతన వస్త్రాలను బహూకరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ షేక్ నిజాంవలి, పొగాకు షబ్బీర్, చికెన్ షాను, వీఆర్వో శ్రీలత పాల్గొన్నారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలు

బత్తలపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన బత్తలపల్లిలో గురువారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలను ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. తొలుత గురుపూజ, ఆయుధ పూజ నిర్వహించారు. జిల్లా ప్రచారక్ కిషోర్‌జీ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్‌లో పాల్గొనడం వల్ల క్రమ శిక్షణతో మెలుగుతామని అన్నారు. అనంతరం నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ముఖ్యులు ప్రకాష్, వెంకటేశ్వరరెడ్డి, నారాయణస్వామి, వెంకటేష్, యోగానందాచారి, ప్రసాద్, రామాంజి, గోపాల్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి కబడ్డీ విజేత బుక్కపట్నం

బుక్కపట్నం , అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో పల్లె ఉమా జ్ఞాపకార్థం నిర్వహించిన కబడ్డీ పోటీలలో జిల్లా స్థాయిలో దాదాపు 24 టీమ్‌లు పాల్గొనగా.. బుక్కపట్నం జట్టు విజేతగా నిలచింది. గురువారం జరిగిన ఫైనల్ పోటీలలో బుక్కపట్నం, కుంటిమద్ది జట్లు తలపడగా హోరాహోరీగా సాగిన మ్యాచ్ బుక్కపట్నం జట్టు విజేతగా నిలచింది. మొదటి బహుమతి రూ. 20వేల నగదు, ట్రోఫీ, రెండో బహుమతిగా కుంటిమద్ది జట్టుకు రూ.15 వేల నగదు, ట్రోఫీని నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు జగదీష్, సంతోష్, సాయి, అంజి పాల్గొన్నారు.



ట్రోఫీ అందుకుంటున్న కబడ్డీ విజేతలు

న్యూస్ బాక్స్

తుమ్మల మారెమ్మకు ప్రత్యేక పూజలు



గుడిబండ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వెలసిన తుమ్మల మారెమ్మ అమ్మవారికి గురు, శుక్ర వారాలు విజయదశమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూలతో అలంకరించి విశేషంగా పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఉపాధి అడిగితే దౌర్జన్యం అంటారా?

● వాహన యజమానుల సంఘం నాయకులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): కియ కార్లపరిశ్రమ రాకతో ఈ ప్రాంతం రూపు రేఖలు మారాయి. అయితే తమ జీవితాల్లో మాత్రం అంతంతమాత్రంగానే ఉన్నాయని, ఉపాధికోసమని మా వాహనాలను అద్దెకు పెట్టుకోమని అడిగితే దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఓ పత్రిక అంటోందని పెనుకొండ పట్టణ వాహనదారులు పేర్కొన్నారు. అసోసియేషన్ కార్యాలయంలో కారు ఓనర్లు, డ్రైవర్లు మాట్లాడుతూ బాడుగలు లేక ఇబ్బందులు పడుతున్నామని, మండలంలోని దుద్దేబండలో ఓహోటల్‌లో మా కార్లు అద్దెకు పెట్టుకోమని యూనియన్ తరుపున వెళ్లామని ఓ పత్రికలో మంత్రి అనుచరులు దౌర్జన్యం చేశారని రాయడం సిగ్గుచేటన్నారు. మాకు పార్టీలకు ఎలాంటి సంబంధంలేదని జీవనోపాధి కోసం అడిగామని, ఇప్పటికైనా పలు పరిశ్రమల్లో, హోటళ్లలో స్థానికంగా ఉన్న వాహనాలను అద్దెకు పెట్టుకోవాలని కోరారు. ఈ ఘటనపై మంత్రి లోకేశ్ స్పందించాలని కోరారు. కార్యక్రమంలో వాహన యజమానులు శోభన్‌బాబు, శ్రీనివాసులు, మారుతి, వెంకటేశ్, రాజారెడ్డి, రవి, జగదీశ్, హరి, శీన పాల్గొన్నారు.

నర్సరీలో మొక్కల పరిశీలన

రొద్దం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ ఉన్న త పాఠశాలలో ఒకేషనల్ కోర్సులో శిక్షణపొందుతున్న విద్యార్థులు శుక్రవారం నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలించారు. మండలంలోని ఆర్.మరువపల్లిలో టమోటా, మిరప, పూల మొక్కలను వారుపరిశీలించారు. వ్యసాయానికి సంబంధించిన విభాగంలో విద్యార్థులు ఇంటర్న్‌షిప్ పూర్తీచేశారు. రైతులు పండించే పంటలు, వాటి ఖర్చు లాభదాయకం, పురుగుల మందు పిచికారి తదితర వాటిని నర్సరీ యాజమాన్య సభ్యులతో అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మీనారాయణమ్మ, అగ్రికల్చర్ ఉపాధ్యాయురాలు నీలిమ, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశాన్ని కుటుంబంగా భావించాలి

హిందూపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దేశాన్ని ఒక కుటుంబంగా భావించి వసుదైక కుటుంబం అనే భావనను ఆచరణలోకి తీసుకొచ్చింది ఆర్ఎస్ఎస్ అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం సహ ప్రాంత ప్రచారక్ జనార్దన్ అన్నారు. ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం పట్టణంలోని పాండురంగనగర్ ఆర్యవైశ్య మారుతియోగా మందిరంలో అంబేడ్కర్ నగర్ భాగ స్వయం సేవకులు శతజయంతి ఉత్సవాలు జరుపుకున్నారు. ముఖ్య అతిథులుగా దంత వైద్యులు భూపాలం విజయబాబు, సహప్రాంత ప్రచారక్ జనార్దన్, బీజేపీ ఆదర్శ్ స్వయం సేవక్ సభ్యులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత పరిగి లెవెన్ జట్టు



ట్రోఫీని అందుకుంటున్న పరిగి లెవెన్ జట్టు

పరిగి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంత్రి సవిత ఆదేశాలతో స్థానిక టీడీపీ నాయకుడు వడ్డె హనుమయ్య ఆధ్వర్యంలో స్థానిక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ గురువారం ముగిసింది. నాలుగు రోజులు నిర్వహించిన టోర్నీలో పరిగి లెవెన్ జట్టు ఆపరేషన్ సిందూర్ జట్టుపై విజయం సాధించింది. విజేత జట్టుకు రూ.15 వేలు, రన్నర్ జట్టుకు రూ.7,500 నగదుతోపాటు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కన్వీనర్ గోవిందరెడ్డి ఇరు జట్లకు బ్యాట్‌లు అందజేశారు. సత్తిరెడ్డి, ధనాపురం రమేష్ పాల్గొన్నారు.

పంచాయతీ అభివృద్ధిపై చర్చ



మాట్లాడుతున్న సర్పంచ్ నరసింహులు

సోమందేపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాగేచెరువు పంచాయతీ అభివృద్ధిపై గురువారం సర్పంచ్ నరసింహులు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో మొదట గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. అనంతరం గ్రామ పం చాయతీలో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. రాబోవు రోజుల్లో చేపట్టే అభివృద్ధి పనులపై ప్రణాళికలు రూపొందించేందుకు తీర్మానించారు. సింగిల్‌విండో అధ్యక్షుడు పూల వెంకటేశులు, తాగునీటి సంఘం అధ్యక్షుడు తిమ్మయ్య, ఆనంద్, అల్లాబకష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ గ్రామసభ

రొద్దం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక గ్రామ సచివాలయం-1లో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ గ్రామసభ నిర్వహించారు. శుక్రవారం అధికారులు, టీడీపీ నాయకులు గ్రామసభ ద్వారా వచ్చే ఏడాది ఉపాధిహామీ పనులపై వందరోజుల ప్రణాళిక రూపొందించారు. చెరువు పూడికతీత, మొక్కల పెంపకం, తదితర వాటిపై చర్చించారు. మెటీరియల్ కాంపొనెంట్ ద్వారా రూ.206.66, కూలి వేతనం రూ.307 చొప్పున అవసరమైన పనులను గుర్తించారు. ఈఓఆర్డీ గోవిందప్ప, టీడీపీ నాయకులు చిన్నప్పయ్య, నరసింహులు, చంద్రమౌళి, ఏపీఓ సూర్యనారాయణ, శ్రీనివాస్‌నాయుడు, క్షేత్రసహాయకులు నరసింహమూర్తి పాల్గొన్నారు.

తాగునీరు వృథా



ట్యాంకు నుంచి వృథాగా పోతున్న నీరు

సోమందేపల్లి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): బుసయ్యగారి పల్లిలో తాగునీరు వృథాగా పోతోంది. తాగు నీరు మురుగు కాలువలో కలుస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. తాగునీటి పైపులు పలుచోట్ల పగిలి పోయాయి. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టీడీ పల్లిలో తాగునీటికి కటకట

● మరమ్మతుకు నోచుకోని బోరు
● నీరు ఉన్నా అవస్థలు పడుతున్న ప్రజలు



చెడిపోయిన బోరు

మడకశిర రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని టీడీ పల్లి బీసీ కాలనీలో తాగునీటి సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై సంబంధిత అధికారల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీ వాసి ఈశ్వరప్ప మాట్లాడుతూ గ్రామానికి కొంత దూరంగా కాలనీ ఉందన్నారు. కాలనీకి అంతటికి ఒక్కటే బోరు ఉందని, అది చేడిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందన్నారు. మరమ్మతు కోసం బోరు నుంచి మోటర్‌ను వేరుచేశారన్నారు. రెండు నెలలు దాటినా మోటారుకు మరమ్మతు చేయకపోవడంతో కాలనీ వాసులు సమీప వ్యవసాయ బోర్ల దగ్గరకు వెళ్లి నీటిని తెస్తున్నట్లు తెలిపారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రాజేష్‌ను వివరణ కోరగా రెండు రోజుల్లో బోరు మరమ్మతు చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

అభివృద్ధిని చూసే టీడీపీలోకి వలసలు

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



టీడీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

మడకశిర టౌన్, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, సీఎం చంద్రబాబుతోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యం అని ప్రజలు విశ్వసిస్తున్నారని, దీంతో టీడీపీలోకి వలసలు అధికమయ్యాయని ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోని పత్తికుంట గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమలతిప్పేస్వామితో కలసి వారిని పార్టీలోకి ఎమ్మెల్యే ఆహ్వానించారు. వారికి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రజల నుంచి మంచి మద్దతు లభిస్తోందన్నారు. వైసీపీ పాలనలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. యర్రబొమ్మనహళ్లి, పత్తికుంటకు చెందిన 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. శ్రీధర్, చక్రంరాజు, హనుమంతేగౌడ్, రంగరాజుతో పాటు 50 కుటుంబాలకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి జయసింహ, నాగరాజు పాల్గొన్నారు.

దసరా వేడుకల్లో కలెక్టర్, ఎస్పీ



కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దంపతులను సన్మానిస్తున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి



ఆలయాన్ని సందర్శిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

లేపాక్షి, అక్టోబరు 3: మండలకేంద్రంలోని లేపాక్షి ఆలయంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి వేడుకల్లో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ దంపతులు, ఎస్పీ సతీష్‌కుమార్ దంపతులు వేర్వేరు సమయంలో పాల్గొన్నారు. ఆలయంలో దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఎస్పీ దంపతులు ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, వేలాడే స్తంభం, సీతాదేవిపాదం, అర్ధాంతరంగా ఆగిన కల్యాణమండపాన్ని సందర్శించారు. ఇద్దరు అధికారులను రెవెన్యూ, దేవవదాయశాఖ సిబ్బంది, ఆలయ కమిటీ చైర్మన్ రమానందన్ ఘనంగా సన్మానించారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ ఉత్సవాలు

పరిగి, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తీచేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలోని బీరలింగేశ్వర ఆలయ మైదానంలో గురువారం ఉత్సవాను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొండూరు నవీన్, మూడు జిల్లాల భౌతిక్ ప్రముఖ్ కిశోర్ హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 1925లో స్థాపించారని, అప్పటి నుంచి దేశాన్ని కుటుంబంగా భావించి ప్రతి ఒక్కరూ జాతీయభావన పెంపొందించాలనే సంకల్పంతో కొనసాగుతోందన్నారు. అనంతరం చెరువుకట్ట సప్తమాతృకాదేవి ఆలయం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు.

కంటెయినర్ బోల్తా



కంటెయినర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

పెనుకొండ రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం తండా సమీపంలోని 44వ జాతీయరహదారిపై ఓ కంటెయినర్ అదుపుతప్పి బోల్తాపడింది. పోలీసులు తెలిపిన మేరకు బెంగళూరు నుంచి కియ పరిశ్రమవైపు వెళ్తున్న కంటెయినర్ వెంకటాపురం తండా వద్దకు రాగానే టైరుపగిలి రోడ్డు పక్కన బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. క్రేన్ సాయంతో కంటెయినర్‌ను బయటకు తీశారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటో ర్యాలీకి తరలిరండి

పెనుకొండ రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు దసరా కానుకగా ఆటోడ్రైవర్లకు రూ.15వేలు అందించే కార్యక్రమంలో భాగంగా శనివారం జరిగే ఆటో ర్యాలీలో తప్పక పాల్గొనాలని మండల కన్వీనర్ ఈశ్వర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. శ్రీకృష్ణదేవరాయల వైజంక్షన్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం వరకు నిర్వహించే ఆటో ర్యాలీలో తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొనాలన్నారు.

గుడిబండ(ఆంధ్రజ్యోతి): మడకశిరలో ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో శనివారం ఆటో డ్రైవర్లకు రూ.15వేలు దసరా కానుక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ కేశవరెడ్డి కోరారు. కార్యక్రమానికి ఆటో డ్రైవర్లు హాజరు కావాలన్నారు.

హిందూపురం(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్ల సేవాపథకం శనివారం ప్రారంభించనుంది. హిందూపురంలో ఆటోలతో రహమత్‌పురం సర్కిల్ నుంచి ప్రారంభించి ఆర్టీఓ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్తారు. అక్కడ సీఎం లైవ్ కార్యక్రమం ఉంటుందని టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమానికి ఆటో ఓవనర్లు ప్రతి ఒక్కరూ రావాలన్నారు.

గోరంట్లలో చోరీ

గోరంట్ల, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ మెస్‌లో, మరోచోట ద్విచక్రవాహనాన్ని బుధవారం రాత్రి ఎత్తుకెళ్లారు. మెస్ హోటల్ షట్టర్ తాళం బద్దలు కొట్టి క్యాష్ బాక్స్‌లోని రూ.500 చిల్లర ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. అనంతరం షాదీమహల్ సమీపంలోని అయాజ్ ఖాన్‌కు చెందిన రూ.1.50 లక్షలు విలువైన పల్సర్ ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా పరిశీలించి రెండు చోట్ల చోరీకి పాల్పడింది ఒకే వ్యక్తిఅని నిర్ధారించారు. నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



నాగరాజు (ఫైల్)

పెనుకొండ రూరల్, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. పెనుకొండ రూరల్ మండలం అమ్మవారిపల్లి 44వ జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ నాగరాజు(31) మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. బంధువులు తెలిపిన మేరకు ధర్మవరం మండలం ఓబుళనాయనపల్లి గ్రామానికి చెందిన నాగరాజు కియ కార్మికులను తరలించే బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. విధుల్లో భాగంగా గురువారం కార్మికులను పరిశ్రమలో వదిలేసి విధులు ముగిశాక అమ్మవారిపల్లి నుంచి స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా కారు వచ్చి ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయిందన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగరాజును స్థానికులు 108లో అనంతపురం ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో కర్నూలు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య వనజ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

అమరాపురం(ఆంధ్రజ్యోతి): మండలం ఉదుగూరు గ్రామంలోని ప్రధానరోడ్డులో ఓ వ్యక్తి శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్థానికులు తెలిసిన మేరకు కాచికుంట గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప పొలంలో కూలీలకు భోజనాలు తెచ్చేందుకు అమరాపురానికి ద్విచక్రవాహనంలో వచ్చి తీసుకుని తిరుగు ప్రయాణంలో ఉదగూరులోని ప్రధాన రోడ్డులో వెళ్తుండగా కాచికుంట గ్రామం వైపు నుంచి వచ్చిన బొలెరో గూడ్స్ వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ ఇషాక్‌బాషా ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రపంచం గర్వించదగ్గ మహనీయుడు గాంధీజీ

● మున్సిపల్ చైర్మన్ రమేష్



గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రపంచ గర్వించదగ్గ మహనుభావుడు గాంధీజీ అని మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప అన్నారు. గురువారం గాంధీ జయంతిని పురస్కరించుకుని ఐదు లాంతర్ల సర్కిల్‌లో, మున్సిపల్ కార్యాలయంలో ఉన్న గాంధీ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళి అర్పించారు. వారు మాట్లాడుతూ మహాత్మగాంధీ దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారన్నారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు వెంకటేశ్, నాయకులు అమర్నాథ్, రెడ్డప్ప, డైమండ్‌బాబా, అంజాద్, తిరుపతయ్య, బాచి, నాగేంద్రమ్మ, సురేష్‌నాయక్, కమిషనర్ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండలంలో గాంధీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కూటమి నాయకులు బాలకృష్ణ చౌదరి,బోయ లక్ష్మీనారాయణ, సంతోష్, సోమశేఖర్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు నిమ్మల విద్యాధరణి, నిమ్మలశ్రీధర్, నాగేనాయక్, రామచంద్రారెడ్డి, తిరుపాల్, బెల్లాల చెరువు చంద్ర, ఉమర్‌ఖాన్, రఘు ఉత్తంరెడ్డి గిరి, అజ్మ, శీనా పాల్గొన్నారు.

రొద్దం(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళి అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను పలువురు నాయకులు కొనియాడారు. మహోన్నత వ్యక్తి అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. సింగిల్‌విండో కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి అధ్యక్షుడు వీరాంజనేయులు ని వాళి ర్పించారు. కన్వీనర్ నరహరి, నాయకులు రామచంద్ర, వాల్మీకి చం ద్రశేఖర్, పవన్‌కుమార్, శ్రీనాథ్‌చౌదరి, హరీష్, తిరుపాల్‌నాయుడు, బేల్దా ర్ రామక్రిష్ణ, అశ్వత్థనారాయణ, రుద్రప్రసాద్, మంజునాథ్ పాల్గొన్నారు.



టీడీపీ కార్యాలయంలో గాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు

వైభవంగా దశమి వేడుకలు





అలంకరణలో పేటవెంకటరమణస్వామి, దుర్గామాతను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



డీఆర్ కాలనీలోని మారెమ్మకు జ్యోతులు మోసుకెళ్తున్న మహిళలు

హిందూపురం, అక్టోబరు 3(ఆంధ్రజ్యోతి): విజయదశమి పండగను వైభవంగా జరుపుకున్నారు. పట్టణంలో శరన్నవరాత్రి పురస్కరించుకుని ఏర్పాటు చేసిన విగ్రహాలను గుడ్డం కోనేరులో నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించారు. విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. పేట వెంకటరమణ స్వామి ఆలయంలో విజయదశమి సందర్భంగా విశేష అలంకరణ, పూజలు, బంగారు కవచంలో భక్తులకు దర్శనమిచ్చారు. కొల్హాపురి మహాలక్ష్మి ఆలయంలో జంబూసవారీగా అమ్మవారిని తీసుకెళ్లారు. నింకంపల్లి రోడ్డులో ఉన్న యల్లమ్మదేవి మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



ఊరేగింపుగా వెళ్తున్న దేవతామూర్తులు

పెనుకొండ(ఆంధ్రజ్యోతి): దసరా నవరాత్రి వేడుకలు గురువారం విజయదశమితో ఘనంగా ముగిశాయి. పండగ సందర్భంగా పట్టణంలోని పురాతన ఆలయాలైన లక్ష్మీ వెంకటరమణస్వామి, వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో 10రోజులపాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆఖరిరోజు జంబూసవారి పేరుతో వివిధ దేవతల ఊరేగింపుతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పట్టణంలోని అనేక దేవాలయాల్లో పదిరోజుల పాటు పూజలు నిర్వహించిన అనంతరం విజయదశమిరోజున మైసూరులో నిర్వహించే జంబూసవారి తరహా పెనుకొండలోనూ నిర్వహించారు. ఊరేగింపులో పైలెట్‌దేవతగా గ్రామదేవత కాళమ్మ ముందుగా బయలుదేరి తిరిగి ఆలయానికి చేరుకున్న తరువాత మిగిలిన ఆలయాల్లోని ఉత్సవ విగ్రహాలు ఊరేగింపుగా బయలుదేరాయి. చివరిగా ఉజ్జయిని మహంకాళి దేవత ఊరేగింపుగా బయలుదేరింది. ఉత్సవాలను తిలకించేందుకు పట్టణ ప్రజలతో పాటు గ్రామీణ ప్రాంతాల ప్రజలు పెనుకొండకు చేరుకున్నారు.



పెద్దమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

సోమందేపల్లి(ఆంధ్రజ్యోతి): దసరా పండుగను పురస్కరించుకుని ఆలయాల్లో అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. సత్తెమ్మ తల్లి విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త ఈశ్వరయ్య ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.





అలంకరణలో కన్యాకాపరమేశ్వరి, వడిసలమ్మ

మడకశిర టౌన్(ఆంధ్రజ్యోతి): విజయదశమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని కోట వెంకటేశ్వరస్వామి, చంద్రమౌళేశ్వర, షిర్డిసాయినాథుడు, వడిసలమ్మ, మారెమ్మ, గంగపూజమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.



పూజల్లో పాల్గొన్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి దంపతులు

మడకశిర రూరల్(ఆంధ్రజ్యోతి): గ్రామ గ్రామాన దసరా వేడుకలు వైభం గా జరిగాయి. మండలంలోని అన్నీ గ్రామాల్లో అమ్మవారి ఆలమాల్లో వేడుకలను ఘనంగా జరుపుకోన్నారు. నీలకంఠాపురం గ్రామంలో మాజీ మంత్రి రఘువీరారెడ్డి దంపతులు ఎద్దుల బండ్లపై ఆలయం వరకు ఊరేగింపు వచ్చారు. అనంతరం ఆలయంలో గోమాత, జమ్మిచెట్టుకు పూజలు నిర్వహించారు.



దుర్గాదేవి ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

గోరంట్ల(ఆంధ్రజ్యోతి): మండలవ్యాప్తంగా విజయదశమి వేడుకలను ప్రజలు భక్తి శ్రద్ధలతో గురువారం నిర్వహించారు. చౌడేశ్వరీదేవి, వాసవీ మాత, మల్లాలమ్మ, రేణుకాయల్లమ్మ, మారెమ్మ, వినాయక, రామాలయాల్లో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ప్రత్యేక రథంపై మాల ధరించిన గోపిస్వామి ఆధ్వర్యంలో బాజాభాజంత్రీల నడుమ మహిళలు నృత్యాలతో అమ్మవారిని ఊరేగించారు.

జీవో నంబరు 5ను రద్దు చేయడం హర్షణీయం

మడకశిర టౌన్, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దొమ్మర కులస్తులను గిరి జ బలిజగా మార్పు చేస్తూ జీవో నం.5ను రద్దు చేయడం హర్షణీయమని కాపు రాక్స్ జిల్లా అధ్యక్షుడు కాపు రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో అ న్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం కల్యాణ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం తమ మనోభావాలకు గౌరవం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.